723 పాఠశాలలు.. పదిమందిలోపే పిల్లలు!



ఉమ్మడి జిల్లాలో

24 పాఠశాలల్లో అసలు విద్యార్థులే లేరు.

126 పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఒక్కరూ లేరు.



పాలకొండి ప్రాథమిక పాఠశాలలో ఒక్కరే విద్యార్థి

న్యూస్‌టుడే, పామర్రు

1.. 2.. 3.. 4.. 10.. ఇవన్నీ ఏదో జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో విద్యార్థులు సాధించిన ర్యాంకులనుకునేరు..! కాదండి బాబు.. ఉమ్మడి జిల్లాలో పలు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య. కొన్నిచోట్ల అసలు బాలలే లేరు. పిల్లలతో కళకళలాడాల్సిన పాఠశాలలు గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాలతో వెలవెలబోతున్నాయి. వైకాపా అయిదేళ్ల పాలనలో ప్రాథమిక విద్య కోలుకోలేనంతగా విధ్వంసానికి గురయ్యింది.

వైకాపా హయాంలో జీవో 117ను అమలు చేసి 3, 4, 5 తరగతులను ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేయడం వల్ల ఆ ప్రభావం ప్రాథమిక బడులపై పడింది.

ఇదీ పరిస్థితి

- ఉమ్మడి జిల్లాలో మొత్తం పాఠశాలలు 3,812
- ప్రాథమిక స్కూళ్లు 2,920
- వీటిలో చదువుతున్న విద్యార్థులు (సుమారు) 1.25 లక్షల మంది
- విలీనం చేసిన ప్రాథమిక పాఠశాలలు 368

నష్టం జరిగిందిలా..

సాధారణంగా పిల్లలను ఒక పాఠశాలలో చేర్పిస్తే ప్రాథమిక విద్య అంతా అక్కడే కొనసాగించాలని తల్లిదండ్రులు ఇష్టపడుతుంటారు. విలీనం కారణంగా ప్రాథమిక పాఠశాలల్లో 1, 2 తరగతులు మాత్రమే ఉండడంతో ఆ రెండేళ్లు మాత్రమే అక్కడ చదివించడం ఎందుకని అయిదు తరగతులున్న బడిలో చేర్పిస్తే బావుంటుందని భావిస్తున్నారు. మరోవైపు 3, 4, 5 తరగతులు చదివేందుకు బడులు మారాల్సి కొంత దూరాభారంగా మారడంతో పిల్లల్ని ప్రైవేటు పాఠశాలల్లో చేర్పించడానికే మక్కువ చూపారు. దీంతో ప్రభుత్వ ప్రాథమిక బడుల్లో విద్యార్థుల చేరికలు గణనీయంగా పడిపోయాయి. సున్నా స్కూళ్లు పెరిగిపోయాయి.

వైకాపా నిర్ణయంతో కళతప్పిన బడులు

లోకేశ్ ప్రకటనతో చిగురిస్తున్న ఆశలు

ఉపాధ్యాయ సంఘాల నేతలతో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఇటీవల చర్చించారు. జీవో నంబరు 117 రద్దు చేయాలని, 3, 4, 5 తరగతుల విలీన ప్రక్రియ ఆపాలని అంతా విన్నవించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి విలీనం నిలిపేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. దీంతో ప్రాథమిక పాఠశాలలకు పూర్వ వైభవం వస్తుందని ఉపాధ్యాయులు ఆశిస్తున్నారు.

విద్యార్థులే లేని బడులు

- **కోనసీమ జిల్లా:** సఖినేటిపల్లి మండలం సూర్యనారాయణపేట, సఖినేటిపల్లి లంక, మలికిపురం మండలం బాడవ
- **కాకినాడ జిల్లా:** తాళ్లరేవు మండలం హోప్‌ఐలాండ్, పెదపూడి మండలం ముక్తేశ్వరం
- **తూర్పుగోదావరి జిల్లా:** చాగల్లు మండలం మల్లవరం, ఎంపీపీఎస్(మెయిన్)

కరుణచూపలేదు కన్నా.. కత్తి దూశాడు ఓ అన్న

తల్లి పేగు తెంచుకు పుట్టిన కనుపాప ఏమైందో ఏమో..
ముళ్లపొదల్లో మరణశాసనం రాశారు..
ఆ బిడ్డ మృతి మానవత్వాన్ని ప్రశ్నిస్తోంది.
కళ్లు తెరవకుండానే, అమ్మపొత్తిళ్లు చేరకుండానే..
నూరేళ్లు నిండుతున్న పసికందుల ఆత్మఘోషకు అంతమెప్పుడు..?



పేగు పంచుకు పుట్టినవాడే పగబట్టాడు..
కర్కశుడై తమ్ముడినే కడతేర్చాడు..
చిన్నప్పుడు దారిచూపిన చెయ్యే పెద్దయ్యాక
ఆస్తి మైకంలో కత్తి దూసింది..
అన్నదమ్ముల సవాళ్లతో..
బంధాలు బలిపీఠ మెక్కుతుంటే..
అంధకారం అలముకుంటుంటే..
అనుబంధాలకు ఆస్కారమేదీ..?



-వివరాలు 10లో


పరిష్కార వేదిక నేడు

రాజమహేంద్రవరం కలెక్టరేట్: జిల్లా స్థాయి ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు. కలెక్టరేట్‌తో పాటు డివిజనల్, మున్సిపల్, మండల కార్యాలయాల్లోనూ ఈ కార్యక్రమం జరుగుతుందని, అర్జీదారులు తమ సమీపంలోని కార్యాలయంలో అధికారులకు అర్జీలు అందజేయవచ్చని ఆమె తెలిపారు.

టెట్‌కు 854 మంది హాజరు

శ్యామలాసెంటర్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష మూడోరోజు ప్రశాంతంగా జరిగింది. రాజీవ్‌గాంధీ ఐయాన్ డిజిటల్ కేంద్రంలో జరిగిన ఈ పరీక్షకు 959 మందికి గాను 820 మంది హాజరవ్వగా 139 మంది గైర్హాజరయ్యారని డీఎస్ఈఓ కె.వాసుదేవరావు తెలిపారు. అలాగే మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 36 మందికి 34 మంది హాజరవ్వగా ఇద్దరు గైర్హాజరయ్యారన్నారు.

టమారా @ 100



ఉమ్మడి జిల్లాలో సాగు తీరిదీ.. (ఎకరాల్లో)	
కాకినాడ	692
తూర్పు గోదావరి	283
అంబేడ్కర్ కోనసీమ	200

న్యూస్‌టుడే, దేవీచౌక్ (రాజమహేంద్రవరం)

టమాటా ధర దారెత్తిస్తోంది. బహిరంగ మార్కెట్‌లో రూ.80 నుంచి రూ.100కు విక్రయిస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో ధర మరింత పెరగవచ్చనే వాదన వినిపిస్తోంది. డిమాండ్‌కు తగ్గ దిగుబడి లేకపోవడమే ఈ పరిస్థితి కారణమని వ్యాపారులు చెబుతున్నారు. మరోవైపు రైతు బజార్లలో ధరలకు.. రిటైల్ మార్కెట్ ధరలకూ భారీ వ్యత్యాసం ఉండడంపై చర్చ నడుస్తోంది.


రాజమహేంద్రవరం టోకు మార్కెట్‌కు గతంతో పోల్చితే సగం సరకే దిగుమతి అవుతోంది. ధర తక్కువగా ఉన్నప్పుడు 30 టన్నులు వస్తే ప్రస్తుతం 15 నుంచి 18 టన్నులు మాత్రమే వస్తోంది. రాజమహేంద్రవరంలోని పెద్ద రైతుబజార్లకు రోజుకు టన్ను, చిన్నవాటికి 50 క్వింటాళ్లు అవసరం కాగా ప్రస్తుతం అందులో సగం మాత్రమే దిగుమతి చేసుకుంటున్నారు. గత ఏడాది సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో కేజీ రూ.17-రూ.18 ఉండగా ప్రస్తుతం రాయితీ టమాటానే రైతుబజార్లలో రూ.58కు అమ్ముతున్నారు. బహిరంగ మార్కెట్‌లో నాణ్యతను బట్టి కేజీ రూ.90 నుంచి రూ.100 వరకు ధర పలుకుతోంది.



రైతుబజారులో రాయితీ టమాట విక్రయాలు

రాయితీ విక్రయాలు ప్రారంభం

రాజమహేంద్రవరం రైతుబజార్లలో రాయితీ టమాట అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వం మార్కెటింగ్ శాఖ ద్వారా ఒక్కో రైతుబజారుకు 20 నుంచి 40 క్రేట్‌లు సరఫరా చేస్తున్నారు. కేజీ రూ.58 ధర నిర్ణయించారు. గత రెండు రోజుల నుంచి ప్రతి రోజూ రైతుబజార్లకు రాయితీ టమాట సరఫరా అవుతోందని ఎస్టేట్ అధికారులు వెల్లడించారు.



చిన్న ఆలయం.. పెద్ద ఊరట

ఈనాడు, రాజమహేంద్రవరం

ధూప, దీప, నైవేద్యాలకు(డీడీఎన్) ఇబ్బంది పడుతూ నిర్వహిస్తున్న చిన్న ఆలయాలకు నెలవారీ ఇస్తున్న రూ.5 వేలను రూ.10 వేలకు పెంచుతూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు దేవాదాయశాఖ ప్రత్యేక కమిషనర్ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ నిర్ణయంపై అర్చకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తూర్పు గోదావరి, కాకినాడ, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిధిలో పల్లెల్లో ఉన్న చిన్న, తక్కువ ఆదాయం వచ్చే ఆలయాలు(గ్రూప్-సి) 429 ఉన్నాయి. వీటిల్లో ధూపదీప నైవేద్యాలకు రూ.10 వేలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనుంది. ఈ మొత్తంలో అర్చకులకు రూ.7 వేలు, ఇతర ఖర్చులకు రూ.3 వేలు చొప్పున కేటాయించారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంతో చిన్న ఆలయాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న అర్చకులకు నెలకు రూ.4 వేలు అదనపు సాయం అందనుంది.

జిల్లా	ఆలయాలు
తూర్పుగోదావరి	86
కాకినాడ	174
అంబేడ్కర్ కోనసీమ	169

ధూపదీప నైవేద్యాలకు ఇకపై రూ.10 వేలు

నెలకు రూ.42.90 లక్షలు

డీడీఎన్ పథకం ద్వారా గతంలో నెలకు రూ.2,500 ఇస్తుండగా గతంలో తెదేపా ప్రభుత్వ హయాంలోనే రూ.5 వేలకు పెంచుతూ చేయూతనిచ్చారు. తాజాగా మళ్లీ రూ.10 వేలకు పెంచారు. ఈ మొత్తాన్ని దేవాదాయ శాఖకు చెందిన సర్వశ్రేయోనిధి(సీజీఎఫ్) నుంచి వినియోగిస్తారు. ఉమ్మడి జిల్లాలో నెలకు రూ.42.90 లక్షలు ఆలయాలకు చెల్లించనుండగా.. అర్చకులకు రూ.30 లక్షల వరకు మేలు జరగనుంది.



గోకవరంలోని పర్వత వర్ధిని రామలింగేశ్వరస్వామి ఆలయం

ఇవీ నిబంధనలు...

- ఆలయం 25 ఏళ్ల క్రితం నిర్మితమై దేవాదాయశాఖ చట్ట పరిధిలో ఉండాలి.
- పురాతన ఆలయాలకు ప్రాధాన్యం. గ్రామీణ ప్రాంతాల పరిధిలో ఉండాలి.
- రెండున్నర ఎకరాల్లోపు చిత్తడి లేదా అయిదెకరాల్లోపు మెట్ట భూమి ఉండి ఏడాదికి రూ.30 వేలలోపు ఆదాయం సమకూరే ఆలయాలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తారు.
- భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించే గ్రామదేవతల ఆలయాల్లో పూజారుల ఆధ్వర్యంలో నిత్యం కైంకర్యాలు నిర్వహించేవాటినీ పరిగణనలోకి తీసుకుంటారు.

16 నుంచి అందుబాటులోకి ఓపెన్ ఇసుక రీచ్‌లు

కలెక్టర్ ప్రశాంతి

వి.ఎల్.పురం (రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: జిల్లాలోని ఓపెన్ రీచ్‌ల ద్వారా ఈ నెల 16 నుంచి మరింత ఇసుక అందరికీ అందుబాటులోకి రానుందని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని క్యాంపు కార్యాలయ సమావేశమందిరంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో తొమ్మిది డీసిల్టేషన్ పాయింట్లలో బోట్స్‌మెన్ సొసైటీల ద్వారా తవ్వకాలు ప్రారంభించామని, పెండ్యాల, పందలపర్రు ర్యాంపుల వద్ద 34 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంచామని తెలిపారు. ఇసుక తవ్వకాల ఛార్జీలుగా వినియోగదారులు టన్నుకు రూ.345 చెల్లించాల్సి ఉంటుందన్నారు. సరఫరా ఖర్చులు గతంలో టన్నుకు రూ.420 ఉండగా ఇప్పుడు అది చాలా తగ్గిందన్నారు. ఓపెన్ స్టాక్ పాయింట్లు కూడా త్వరలో అందుబాటులోకి రానున్నందున ఇసుక ఆపరేషనల్ ఛార్జీలు మరింత తగ్గి టన్ను ఇసుక రూ.210కే పంపిణీ జరుగుతుందన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి, చిత్రంలో జేసీ, అదనపు ఎస్పీ

అక్రమాలకు తావులేకుండా చర్యలు

జిల్లా టాస్క్‌ఫోర్సు బృందం ద్వారా నిరంతరం పర్యవేక్షణ జరిపి ఇసుక రవాణాలో అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడిన వారికి జిల్లాలో ఇప్పటివరకు రూ.24 లక్షల అపరాధరుసుం విధించినట్లు తెలిపారు. పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రత్యేక పర్యవేక్షణకు సిబ్బందిని, కలెక్టరేట్, డివిజన్ స్థాయిల్లో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశామని తెలిపారు. అవకతవకలపై నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. సమావేశంలో జేసీ చిన్నరాముడు, జిల్లా అదనపు ఎస్పీ సుబ్బరాజు పాల్గొన్నారు.

48 బోట్స్‌మెన్ సొసైటీల ద్వారా తవ్వకాలు

బోట్స్‌మెన్ సొసైటీల ద్వారా ఎక్కువ ఇసుకను బయటకు తీయడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే 48 సొసైటీలు గుర్తించి అనుమతులు ఇచ్చామని, అవసరమైతే మరిన్ని గుర్తిస్తామన్నారు. అయిదు రోజులుగా పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే ఇసుక బుకింగ్ జరుగుతోందని.. 147 ఆర్డర్లు వచ్చినట్లు తెలిపారు. సోమవారం నుంచి ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసుకున్న వినియోగదారులకు తొమ్మిది పాయింట్ల నుంచి నిత్యం 13 నుంచి 15 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందించనున్నట్లు తెలిపారు. మాన్యువల్ విధానంలో 17 ఓపెన్ రీచ్‌ల ద్వారా 12 లక్షల మెట్రిక్ టన్నులు, డీసిల్టేషన్ గోదావరి ముందర తీర ప్రాంతంలో ఎనిమిది చోట్ల 3 లక్షల మెట్రిక్ టన్నులు అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టామన్నారు. పట్టా భూముల్లో తవ్వకాల కోసం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. డీ పట్టాభూముల్లో తవ్వకాలకు ధర నిర్ణయించామని తెలిపారు.

రాజమహేంద్రిలో కుండపోత

ఏవీఏ రోడ్(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే:

తూర్పుగోదావరి జిల్లా కేంద్రం రాజమహేంద్రవరంలో ఆదివారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి నగరం జలమయంగా మారింది. సుమారు గంటపాటు కుండపోతగా పడటంతో ఆల్కాట్‌గార్డెన్ నుంచి శ్యామలా సెంటర్ వరకు అనేక ముఖ్య ప్రాంతాలు వర్షపునీటిలో చిక్కాయి. కోటిపల్లి బస్టాండ్, క్రీడా పార్కు, రోడ్ కం రైలు బ్రిడ్జి రోడ్డు, రైల్వేస్టేషన్ తదితర చోట్ల రోడ్లు చెరువులను తలపించాయి. వర్షపునీరు కాలువల్లో మురుగుతో కలసి రోడ్లపై పొంగి పొర్లింది. దీంతో వాహనదారులు అవస్థలు ఎదుర్కొన్నా.. జనజీవనం స్తంభించింది. ఇన్నీసుపేటలో రాత్రి వరకు నీరు అలాగే నిలిచిపోయింది. వర్షం పడిన ప్రతిసారీ నగరంలో ఈ పరిస్థితి నిత్యకృత్యం కావడంతో జనం ఇబ్బంది పడుతున్నారు.



రాజమహేంద్రవరం రోడ్ కమ్ రైలు వంతెన రోడ్డులో వర్షపునీరు..



గూడ్స్‌గేటు వద్ద నీరు నిలవడంతో చోదకుడి అవస్థ

సీబీఐకి చిక్కిన కస్టమ్స్ అధికారులు

రూ.3.18 లక్షల లంచం సొమ్ముతో పట్టుబడిన సూపరింటెండెంట్

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ పోర్టులోని కస్టమ్స్ కార్యాలయంతోపాటు అధికారుల నివాసాలపై శనివారం సీబీఐ అధికారులు దాడులు నిర్వహించారు. పలువురు అధికారుల నుంచి మొత్తం సుమారు రూ.31 లక్షలు స్వాధీనం చేసుకున్నారు.

లంచం తీసుకుంటున్నారన్న ముందస్తు సమాచారం మేరకు నిఘావేసిన అధికారులు కాకినాడ పోర్టు కస్టమ్స్ సూపరింటెండెంట్ వై.శ్రీనివాస్ వద్ద నుంచి రూ.3,18,200 స్వాధీనం చేసుకున్నారు. లంచం ఇచ్చిన కాకినాడకు చెందిన శ్రీ చంద్ర బల్క్ కార్గో సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి పంతం భరత్‌కుమార్‌నూ అరెస్టు చేశారు. విచారణ క్రమంలో నిందితుల సమాచారం ఆధారంగా కస్టమ్స్ అసిస్టెంట్ కమిషనర్ నుంచి రూ.22.74 లక్షలు, మరికొందరు కస్టమ్స్ అధికారుల నుంచి రూ.5 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో అసిస్టెంట్ కమిషనర్, ఇతర కస్టమ్స్ అధికారులు వేరేచోటుకు ప్రయాణానికి సిద్ధమవుతుండగా దాడులు చేసి ఈ నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీబీఐ పేర్కొంది. వీరి పేర్లు మాత్రం వెల్లడించలేదు. ఈ కేసులో కొందరు ప్రైవేటు వ్యక్తులు, ప్రభుత్వ ఉద్యోగులూ ఉన్నట్లు ఎఫ్ఐఆర్‌లో నమోదు చేశారు. అరెస్టు చేసిన ఇద్దరు నిందితులను విశాఖపట్నం సీబీఐ న్యాయస్థానంలో న్యాయమూర్తి ఎదుట ఆదివారం హాజరు పరచగా రిమాండ్ విధించారు. విశాఖపట్నం సీబీఐ యూనిట్‌లోని అవినీతి నిరోధక విభాగం బృందాలుగా ఈ సోదాల్లో పాల్గొంది. అనుమానితుల ఇళ్లలో, కార్యాలయాల్లో సోదాలు నిర్వహించి, దస్త్రాలు స్వాధీనం చేసుకున్నామని, దర్యాప్తు కొనసాగుతోందని సీబీఐ ఎస్పీ ఒక ప్రకటనలో తెలిపారు.

సొంతింటి కల సాకారం

'మన ఇల్లు.. మన గౌరవం' పేరిట సదస్సులు

తాళ్లపూడి, న్యూస్‌టుడే

పేదల సొంతింటి కల నెరవేరుస్తామంటూ ఆర్భాటం చేసిన వైకాపా ప్రభుత్వం ఆచరణలో విస్మరించింది. తమ హయాంలో మంజూరు చేసిన గృహ నిర్మాణాలు సైతం మందకొడిగా సాగినా పట్టించుకోలేదు. వీటిని పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా సొంతింటి కల ఆవశ్యకతను వివరించేలా 'మన ఇల్లు - మన గౌరవం' పేరిట ప్రత్యేక కార్యక్రమం కింద జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది.

ప్రధానమంత్రి అవాస్ యోజన కింద ఇంటి నిర్మాణానికి గత వైకాపా ప్రభుత్వం పట్టణాల్లో పేదలకు సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర స్థలం కేటాయించింది. వీటితో పాటు సొంత స్థలం ఉన్న వారికి కూడా ఇళ్లు మంజూరు చేశారు. అయితే నిర్మాణాలు అంతంత మాత్రంగానే జరిగాయి. ఇంటి నిర్మాణం పూర్తికాక.. ఇందుకు చేసిన అప్పులు తీర్చే దారిలేక లబ్ధిదారులు విలవిలలాడుతున్నారు. వీరిని ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా లేఔట్లు, సొంత స్థలాల్లో శ్లాబ్ దశల్లో ఉన్న నిర్మాణాలను ఈ ఏడాది అక్టోబర్ నెలాఖరులోగా.. పునాది, గోడలస్థాయిలో ఉన్న వాటిని వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తిచేయాలని నిర్ణయించింది. పీఎంఏవై 1.0 కింద మంజూరైన గృహాలను వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేయకుంటే పీఎంఏవై 2.0 కింద తిరిగి మంజూరు కోసం పరిగణించరని గృహ నిర్మాణశాఖ అధికారులు అంటున్నారు. ఈ పథకం కింద మంజూరయ్యే గృహాలకు కేంద్రం సాయం పెంచడం లేదని తెలిపారు. పీఎంఏవై 1.0 కింద ఇళ్లు పొందిన వారికి మళ్లీ కేటాయించే అవకాశం ఉండదు. ఈ పరిస్థితుల్లో ఉన్న స్థలంలో ఇంటి నిర్మాణం పూర్తి చేయించేందుకు కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది.

జిల్లాలోని గృహనిర్మాణాలు ఇలా..	
మంజూరైన ఇళ్లు	65,075
పూర్తయినవి	25,243
పునాది దశలో ఉన్నవి	6,699
మధ్యస్థాయిలో	1,986
గోడలతో	1,391
శ్లాబ్ వరకు పూర్తయినవి	2,385
పునాది బీమ్	2,356
మొదలుపెట్టనివి	25,015



అవగాహన కార్యక్రమంలో అధికారులు

సద్వినియోగం చేసుకోవాలి..

ఇది మంచి అవకాశం. లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి. ఇదే విషయాన్ని అవగాహన సదస్సుల్లో వివరిస్తున్నాం. అసంపూర్తిగా ఉన్న నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి. వచ్చే 100 రోజుల్లో 4,300 గృహాలు పూర్తి చేయాలి. పనులు జరుగుతున్న క్రమంలో వారం రోజుల్లో నగదు జమ అవుతోంది.

-ఆర్. కృష్ణనాయక్, ఇన్‌ఛార్జి పీడీ, గృహ నిర్మాణశాఖ

శిలాఫలకం వెక్కిరిస్తోంది..

ముంపుబారిన వందలాది ఎకరాలు

న్యూస్‌టుడే, సీతానగరం

వరదలు, అధిక వర్షాల కారణంగా ఏటా వందలాది ఎకరాలు ముంపుబారిన పడుతుండటంతో అన్నదాతలు తల్లడిల్లుతున్నారు. సీతానగరం మండలం పురుషోత్తపట్నం ఆవ నుంచి రామచంద్రపురం, చినకొండేపూడి వరకు సుమారు 1,500 ఎకరాలు ఏటా ముంపుబారిన పడుతున్నాయి. ఈ ఏడాది 200 ఎకరాల్లో వరిపంట నష్టపోయినట్లు వ్యవసాయశాఖ తన నివేదికల్లో వ్యవసాయశాఖ చూపించింది. గత వైకాపా ప్రభుత్వంలో రూ.కోట్లతో దీని నివారణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చి శిలాఫలకం వేసి పనులు చేపట్టకపోవడంతో రైతులు నష్టపోయారు.



రామచంద్రపురం వద్ద రూ.1.40 కోట్ల శిలాఫలకం

కొండ గోదావరి, వర్షాలకు వచ్చే ముంపుబారి నుంచి పంటపొలాలను కాపాడేలా రూ.1.40 కోట్లతో ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల వేళ వైకాపా ప్రభుత్వం శిలాఫలకం వేసింది. సీతానగరం మండలం పురుషోత్తపట్నం ఆవ నుంచి చెరుకావ వరకు మురుగుకాలువ వ్యవస్థను ఆధునికీకరణ చేస్తామని అప్పటి వైకాపా నాయకులు రైతులకు హామీ ఇచ్చి భూమిపూజ చేశారు. ఎకరం కూడా ముంపులోకి చేరదని భరోసా ఇచ్చారు. ఈ పనులు చేపట్టే సమయంలో మధ్యలో నాలుగు కల్వర్టులు కూడా పూర్తిచేసేలా వేసిన డిజైన్ చూపించారు. ఇది ప్రచార ఆర్భాటంగానే మిగిలిపోయింది. ఈ ఏడాది ఫిబ్రవరి 12న శంకుస్థాపన చేసిన ఈ పథకానికి ఆ తర్వాత ఒక గంప మట్టి పనులు కూడా అప్పటి ప్రభుత్వం చేయలేదు. ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావడం వల్ల పనులు నిలిచిపోయాయనే వైకాపా నేతల ప్రచారాన్ని రైతులు నమ్మలేదు. నేటికీ ఆ శిలాఫలకం వెక్కిరిస్తూనే ఉంది.



పురుషోత్తపట్నం వద్ద ఆవ ముంపులో భూములు

వరి కుళ్లిపోయింది

ఈ ఏడాది ఎగువ నుంచి వచ్చిన కొండగోదావరి, అధిక వర్షాలతో ముంపుబారిన పడి నాలుగు ఎకరాల్లో వేసిన వరిపంట పూర్తిగా కుళ్లిపోయింది. పెట్టుబడి రూ.50 వేలతో పాటు ఫలసాయంగా వచ్చే మరో రూ.2 లక్షల ఆదాయాన్ని కోల్పోయాను. గత వైకాపా ప్రభుత్వం రూ.1.40 కోట్లతో పంపింగ్ స్కీం అంటూ వేసిన శిలాఫలకం వెనుకనే నా పొలం ఉంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలోనైనా దీనిని పూర్తిచేస్తే వందలాది ఎకరాల్లో పంటను కోల్పోకుండా ఉంటాం.

- కలగర బాలకృష్ణ, రైతు, రామచంద్రపురం

ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం..

పురుషోత్తపట్నం నుంచి చినకొండేపూడి చెరుకావ వరకు మురుగుకాలువ ఆధునికీకరణ పనులు చేసేందుకు ఎత్తిపోతల పథకం ఉంది. జలవనరులశాఖ ఆధ్వర్యంలోనే దీని పనులు చేసేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాం. గత ప్రభుత్వంలో గుత్తేదారుడికి పనులు అప్పగించాం. ఈలోపు ఎన్నికలు రావడంతో ఆగిపోయింది. ప్రస్తుత ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం.

- ఏఎస్ఎస్‌వీ ప్రసాద్, ఏఈ, జలవనరులశాఖ, ధవళేశ్వరం



నిడదవోలు వడ్డీలవీధిలో కనకదుర్గమ్మ



గోపాలపురంలో శ్రీలలితా త్రిపుర సుందరీ దేవిగా.



బాలాజీపేట తూర్పు రైల్వేస్టేషన్ సమీపంలో కనకదుర్గ

అమ్మా.. శాంభవి

దసరా ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించారు. భక్తులు ఆలయాలకు పెద్దఎత్తున తరలివెళ్లి పూజల్లో పాల్గొన్నారు. సామూహిక కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు. దీంతో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

– న్యూస్‌టుడే, హుకుంపేట, గోపాలపురం, నిడదవోలు, రాజమహేంద్రవరం సాంస్కృతికం



రాజమహేంద్రవరం దేవీచౌక్ వద్ద సామూహిక కుంకుమ పూజలు



ఘటాలను ఏర్పాటు చేస్తున్న పండితులు

నేడు సహస్ర ఘటాభిషేకం

బిక్కవోలు: కొంకుదురు గోపాల రామానాయుడు వీధిలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సహస్ర ఘటాభిషేకం జరగనుంది. ఇందుకు అవసరమైన ఘటాలను పండితులు సిద్ధం చేస్తున్నారు. శ్రీచక్రాలలో వేయి ఘటాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు కమిటీ సభ్యులు చిన్నం శ్రీనివాస రెడ్డి, కర్రి శ్రీనివాస రెడ్డి తెలిపారు.

425 మద్యం దుకాణాలకు దరఖాస్తులు

రాజమహేంద్రవరం నేరవార్తలు: జిల్లాలోని మద్యం దుకాణాల లైసెన్స్‌లకు గాను ఆదివారానికి మొత్తం 425 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్.లావణ్య తెలిపారు. జిల్లాలోని 125 దుకాణాలకు గాను ఇచ్చిన నోటిఫికేషన్ ద్వారా ఈ నెల అయిదో తేదీ నాటికి 250 దరఖాస్తులు అందగా.. ఆదివారం మరో 175 దరఖాస్తులు వచ్చాయన్నారు. 9న స్వీకరణ ముగుస్తుందని.. 10న పరిశీలించిన అనంతరం 11న లాటరీ పద్ధతిలో లైసెన్స్‌లు అందిస్తామన్నారు.

నేటి నుంచి అంతర్ జిల్లాల హ్యాండ్‌బాల్ పోటీలు

దివాన్‌చెరువు(రాజానగరం): దివాన్ చెరువు శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో ఈ నెల 7 నుంచి ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ హ్యాండ్‌బాల్ 2024-25 పోటీలు నిర్వహించనున్నామని తూర్పుగోదావరి జిల్లా పాఠశాల క్రీడాసమాఖ్య అండర్-14, 17 కార్యదర్శి ఎస్‌ఆర్‌కేవీ స్వామి తెలిపారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అండర్-17 బాలుర విభాగంలో నిర్వహించే ఈ పోటీలు ఈ నెల 9 వరకు జరుగుతాయన్నారు.

ఆడబిడ్డకు ఎంత కష్టం వచ్చిందో..

చెత్తకుప్పలో శిశువు మృతదేహం

రాజమహేంద్రవరం నేరవార్తలు: ఏ తల్లి కన్నదో.. పుట్టగానే చనిపోయిందో లేక బతికుండగానే తెచ్చి పడేస్తే ప్రాణాలు వదిలిందో తెలియదు.. అభంశుభం తెలియని నెలల శిశువు చెత్తకుప్పలో మృతదేహంగా కనిపించడం స్థానికులను కలచివేసింది. తుమ్మలోవ ప్రాంతంలోని జయరామ్ థియేటర్ సమీపంలో రోడ్డు పక్కన ఆదివారం ఉదయం చెత్తకుప్పలో ఈ దృశ్యం కనిపించింది. ఈగలు వాలుతూ ఓ మాంసం ముద్దలా ఉన్న ఆకారాన్ని కుక్కలు లాగబోతుంటే స్థానికులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఆడశిశువు మృతదేహంగా గుర్తించి ప్రభుత్వాసుపత్రి శవాగారానికి తరలించారు. ఇంకా బొడ్డుతాడు కూడా తీయని శిశువు మృతి చెందితే అక్కడ పడేశారా.. ఆడబిడ్డ అని తెలిసి బతికుండగానే ఈ ఘాతుకానికి పాల్పడ్డారో విచారణలో తెలియాల్సి ఉందని రాజమహేంద్రవరం మూడో పట్టణ సీఐ వి.అప్పారావు తెలిపారు.

భార్యాపిల్లల ముందే నరికేశాడు

ఆస్తి వివాదంలో అన్న చేతిలో తమ్ముడి హత్య

తాళ్లరేవు: ఆస్తి వివాదం ఉన్మాదిలా మార్చేసింది. తోడబుట్టిన తమ్ముడినే కత్తితో కడతేర్చేలా చేసింది. తాళ్లరేవు మండలం పి.మల్లవరంలో అన్నదమ్ముల మధ్య ఘర్షణ హత్యకు దారితీసింది. కోరింగ ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. వెంటపల్లి నూకరాజు ఇంటిదగ్గర కొబ్బరితోటలో ఆదివారం ఉదయం కొబ్బరి దింపుతుండగా అతడి అన్న ఏడుకొండలు అక్కడికి వెళ్లాడు. తోటలో తనకూ వాటా ఉందనడంతో ఇద్దరి మధ్య మాటల యుద్ధం సాగింది. ఇంతలో ఏడుకొండలు కత్తితో నూకరాజుపై దాడిచేశాడు. అతడు కింద పడటంతో మరో నాలుగుచోట్ల నరకడంతో నూకరాజు(44) అక్కడికక్కడే మృతిచెందాడు.



మృతుడి భార్య, పిల్లలు



నూకరాజు (పాత చిత్రం)

కొబ్బరికాయలు దింపు తీసేందుకు వచ్చిన రెడ్డి రామకృష్ణపై సైతం దాడి చేసేందుకు ప్రయత్నించగా అతడు తప్పించుకున్నాడు. దీంతో అక్కడి నుంచి పరారయ్యాడు. మృతుడి భార్య నాగరత్నం, తొమ్మిదేళ్ల కుమారుడు, అయిదేళ్ల కుమార్తె కళ్లెదుటే హత్య జరగడంతో వారంతా షాక్‌కు గురయ్యారు. పోలీసులు వివరాలు సేకరించారు. ఇల్లు, కొబ్బరితోట వివాదం కోర్టులో ఉందని, నిందితుడి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు.

కాలుజారి గోదావరిలో పడి ఒకరి మృతి

సీతానగరం, న్యూస్‌టుడే: పాడి పశువులను మేత కోసం గోదావరి లంకల్లోకి తీసుకెళ్లిన ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు నదిలో కొట్టుకుపోయి మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు అందించిన వివరాలిలా.. సీతానగరం మండలం ఇనుగంటివారిపేటకు చెందిన మాగాపు శ్రీనివాస్(36) ఆదివారం సాయంత్రం లంకల్లో ఉన్న గేదెలను ఇంటికి తీసుకొచ్చే సమయంలో నదిలో కాలుజారి కొట్టుకుపోయాడు. పరిసరాల్లో ఉన్న వారు గాలించి బయటకు తీసుకొచ్చారు. అప్పటికే శ్రీనివాస్ విగతజీవిగా మారాడు. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై డి.రామ్‌కుమార్ తెలిపారు.

బౌద్ధం.. జీవన మార్గం

బుద్ధిస్ట్ కౌన్సిల్ సమావేశానికి విచ్చేసిన బౌద్ధులు

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: జీవన మార్గమైన బౌద్ధాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని బౌద్ధ పీఠాధిపతి అనాలయొ అన్నారు. ఆంధ్రప్రదేశ్ బుద్ధిస్ట్ కౌన్సిల్ తృతీయ సర్వసభ్య సమావేశాన్ని అనాలయొ ఆధ్వర్యంలో ఉండ్రాజవరంలోని బుద్ధవిహార్‌లో ఆదివారం నిర్వహించారు. త్రిపీటకాలతో పాటు బౌద్ధ గ్రంథాలు సమకూర్చి ఉండ్రాజవరంలోని బౌద్ధ గ్రంథాలయంలో అందుబాటులో ఉంచామన్నారు. వాటిని బౌద్ధులు, సావనీర్‌లు, బౌద్ధాభిమానులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉండ్రాజవరంలో నిర్మిస్తున్న బుద్ధవిహార్ రాష్ట్రంలోనే ఆదర్శంగా ఉంటుందన్నారు. బౌద్ధం మతం కాదని, సైన్సుతో పోలి ఉండే అనేక ధర్మాలు బౌద్ధంలో ఉన్నాయన్నారు. ఈ ధర్మాలు మానవ మనుగడకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఉండ్రాజవరంలోని బుద్ధవికాస కేంద్రం ద్వారా వందలాది మంది చిన్నారులు తర్ఫీదు పొందుతున్నారన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విరివిగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించారు. బౌద్ధపీఠంలో నిర్వహిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. తొలుత బుద్ధుని మందిరంలో ప్రత్యేక ఆరాధన నిర్వహించారు. నూతనంగా చేపట్టనున్న సేవా కార్యక్రమాలపై ప్రణాళిక సిద్ధం చేశారు. కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంతోపాటు ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల నుంచి బౌద్ధులు విచ్చేసి కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అనాలయొ

'కాలుష్య పరిశ్రమను మూసేయాలి'

గోకవరం, న్యూస్‌టుడే: పరిశ్రమ నుంచి వచ్చే దుర్వాసనతో ఊపిరి ఆడడం లేదని ఇళ్ల మధ్య ఇలాంటి కాలుష్య పరిశ్రమలను పెడితే ఎలా అంటూ మహిళలు కన్నెర్ర చేశారు. గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డిలో ఏర్పాటు చేసిన అస్సాగో ఇథనల్ పరిశ్రమ నుంచి పెద్దఎత్తున దుర్వాసన రావడంతో గుమ్మళ్లదొడ్డి, బావాజీపేట గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం రాత్రి నుంచి పరిశ్రమ గేటు ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్నారు. పరిశ్రమ యాజమాన్యం స్పందించకపోవడంతో ఆదివారం పరిశ్రమ వద్దకు పెద్దఎత్తున మహిళలు తరలివచ్చారు. మండుటెండను లెక్కచేయకుండా గేటు బయట బైఠాయించి 'మూసేయాలి..పరిశ్రమను మూసేయాలంటూ' పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఎస్సై పవన్‌కుమార్‌తో పాటు కోరుకొండ, రాజమహేంద్రవరం నుంచి పోలీస్ సిబ్బంది అక్కడకు చేరుకొని వారిని అదుపు చేశారు. అయినప్పటికి వారు ఆందోళన విరమించలేదు. సమస్య పరిష్కారానికి పరిశ్రమ ప్రతినిధులు చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.



ఇథనల్ పరిశ్రమ వద్ద మహిళల ఆందోళన

అథ్లెటిక్స్ ఓవరాల్ ఛాంపియన్ విశాఖ

శ్యామలాసెంటర్: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను విశాఖపట్నం కైవసం చేసుకుంది. వరుసగా బాలురు, బాలికల ఛాంపియన్‌షిప్‌ను కూడా కైవసం చేసుకొని అన్నింటా విజయకేతనం ఎగురవేసింది. ఇక వ్యక్తిగత బాలుర విభాగంలో దుడ్డు శేషు (విశాఖ), ఎస్‌కే రోషన్ (గుంటూరు) కైవసం చేసుకోగా.. బాలికల విభాగంలో ఎల్.డింపుల మహశ్రీ (ఏలూరు), బాకి శైలజ (విశాఖ), పి.వసంత (విజయనగరం) కైవసం చేసుకున్నారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో విజేతలను సంఘ సభ్యులు ఎన్.శివకుమార్ తదితరులు అభినందించారు.



బహుమతులు అందుకున్న క్రీడాకారిణులతో నిర్వాహకులు

జాతీయస్థాయి పోటీల్లో సత్తాచాటాలి

రాజానగరం: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సీబీఎస్ఈ క్లస్టర్-7 పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులు మరింత నైపుణ్యం, ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో రాణించాలని హెక్సావేర్ వైస్ ప్రెసిడెంట్ వినోద్‌వర్మ ఆకాంక్షించారు. రాజమహేంద్రవరం సమీపంలోని దివాన్‌చెరువు శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో నిర్వహిస్తున్న సీబీఎస్ఈ క్లస్టర్-7 బాలుర వాలీబాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన విజేతలకు బహుమతులు అందజేశారు. మరో ముఖ్యఅతిథి, శ్రీప్రకాష్ విద్యానికేతన్ డైరెక్టర్ సీహెచ్ విజయప్రకాష్ మాట్లాడుతూ విజేతలు ఈ నెల 21న హిమాచల్‌ప్రదేశ్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. జిల్లా వాలీబాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ వై.వెంకట్, విశ్రాంత వ్యాయామోపాధ్యాయుడు ఎస్.గంగాధర్, పరిశీలకుడు పి.కిశోర్‌బాబు, ప్రిన్సిపల్ విమల, మేనేజర్ ఏఎస్ఎన్ మూర్తి, సీనియర్ ప్రిన్సిపల్ ఎంవీవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



అండర్-17 విభాగంలో విజేతలు, ముఖ్యఅతిథులు

జూదమాడుతూ దొరికిపోయిన ద్వారంపూడి అనుచరుడు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా జూదమాడుతున్నారని కొవ్వూరులోని ఓ క్లబ్‌పై ప్రత్యేక పోలీసులు ఈనెల 4న దాడిచేసిన ఘటనలో తప్పించుకునే యత్నంలో గోడదూకిన కాకినాడ నగర వైకాపా మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ప్రధాన అనుచరుడు అంకాడి సత్తిబాబు తీవ్ర గాయాలపాలయ్యారు. అప్పటి నుంచి పలు మారుపేర్లతో రాజమహేంద్రవరంలోని ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్సపొందిన ఆయన పరిస్థితి ప్రమాదకరంగా మారడంతో శనివారం కాకినాడలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చేరారు. మాజీ ఎమ్మెల్యే, వైకాపా నేత అనుచరుడు కావడంతో ఇంటి పేరును తప్పుగా చెబుతూ కేసు నుంచి తప్పించాలని కొందరు తీవ్రంగా ప్రయత్నించారు. వైకాపా నాయకుడని, హెచ్ఎంఎస్ యూనియన్ అధ్యక్షుడని వాస్తవాలు వెలుగులోకి రావడంతో ఆ పార్టీకి చెందిన పలువురు నాయకులు పరామర్శించేందుకు ఆదివారం ఆస్పత్రికి వెళ్లారు. గతంలో కాకినాడ తేదేపా కార్యాలయంపై దాడి కేసులో సత్తిబాబు ప్రధాన నిందితుడని తేదేపా నాయకులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఘటనపై కొవ్వూరు పట్టణ పోలీసులు కేసు నమోదుచేశారు.

ఇంజినీరింగ్ చదివి.. దొంగగా మారి..

నిందితుడి నుంచి రూ.10 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

గుంటూరు, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ చదివిన ఒక యువకుడు దురలవాట్లకు బానిసయ్యాడు. ప్రయివేటు ఉద్యోగాలతో వచ్చే సంపాదన జల్సాలకు సరిపోకపోవడంతో దొంగ అవతారమెత్తాడు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డాడు. ఇటీవల గుంటూరులో భారీ ఎత్తున బంగారు ఆభరణాలు అపహరించి కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న బావ ఇంట్లో దాచి పెట్టాడు. నిందితుడిని గుంటూరు పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేసి సొత్తు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన గొర్రెల చినబాబు 2015లో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశాడు. అప్పట్లో మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పని చేశాడు. ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. క్రికెట్ బెట్టింగ్, గుర్రపు పందేలు, జూదానికి బానిసై డబ్బు సరిపోక 2019 నుంచి దొంగగా మారాడు. వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడటంతో పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. ఇలా పలు స్టేషన్లలో 30 వరకు కేసులున్నాయి. జైలులో పరిచయమైన నాగ్‌పూర్‌కు చెందిన శామ్యూల్‌రాజుతో కలిసి గత నెల 21న గుంటూరులో ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. చోరీ సొత్తుతో పరారై కాకినాడ ఏపీఎస్‌బీ మూడో బెటాలియన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న బావ వినోద్ ఇంట్లో దాచి పెట్టినా సోదరి, బావకు తెలియకుండా జాగ్రత్తలు తీసుకున్నాడు. ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ ద్వారా నిందితుడి ఆచూకీ కనుగొన్న పోలీసులు అతడిని అరెస్టు చేశారు. రూ.10 లక్షల విలువైన 306 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. మరో దొంగ శామ్యూల్‌రాజును గత నెల 28న హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ.లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	11,500
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	14,000-15,000
కొత్త (పచ్చి) కాయ	13,500-14,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ.లలో

ఫారంరేటు	120-00
రిటైల్ లైవ్	142-00
డ్రెస్డ్	206-00
స్కిన్‌లెస్	234-00

రాజమహేంద్రవరం

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లో)




దేవీచౌక్: టమాట(రాయల్)-58, వంకాయలు నలుపు-34/ గులాబీ-48/తెలుపు-36/దొండ్లు-48, బెండ-34, కాకర-34, బీర పందిరి-48/40, దొండ-48, క్యారెట్-46/42, బీట్‌రూట్-34, గోరుచిక్కుడు-38, దోస-30, ఆనబకాయ-32/30, చిక్కుడు-76/దేశవాళీ-86, పచ్చిమిర్చి-24, బంగాళదుంపలు-32, ఉల్లిపాయలు-50/కొత్తవి-35

ఉచితంగా పరీక్షలు, మందుల పంపిణీ

టి.నగర్, న్యూస్‌టుడే: మోగాని వాస్క్యులర్ కేర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత సిరల వాపు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. స్థానిక త్యాగరాజ్ నగర్‌లో హిందూ సమాజ్, న్యాపతి సుబ్బారావు పంతులు రోటరీ కళా వేదికలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని గ్రామీణం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో అనుకొని వ్యాధులకు గురవుతున్న వారి సంఖ్య ఎక్కువగా ఉంటోందని, ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

కాలనీ పేరునే మార్చేశారు..



మోడెర్న్‌కాలనీ పేరుతో తప్పుగా ఏర్పాటు చేసిన బోర్డు

ఇది నగరంలో వదో డివిజన్ పరిధిలోని ఆల్కాట్ కాలనీ. ఎక్కువ మంది బ్యాంకు ఉద్యోగులు, విశ్రాంత బ్యాంకు ఉద్యోగులు నివాసముండే ప్రాంతం. ఇక్కడి ప్రధాన మార్గంలో కాలనీ పేరును సూచిస్తూ నగరపాలక సంస్థ ఏర్పాటు చేసిన బోర్డు చూసి స్థానికులు అవాక్కవుతున్నారు. ఆల్కాట్ కాలనీ పేరుకు బదులు మోడెర్న్ కాలనీ పేరుతో తప్పుగా బోర్డు ఏర్పాటు చేశారని స్థానికులు చెబుతున్నారు. దీనివల్ల ఇక్కడి కొత్త వ్యక్తులు, బంధువులు చిరునామా విషయంలో గందరగోళానికి గురవుతున్నారని చెబుతున్నారు. అధికారులు స్పందించి మార్పు చేయాలని అభ్యర్థిస్తున్నారు. – న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

తీరంలో ఇసుక దొంగలు

రేవుల్లో ఇసుక అందుబాటులో లేకపోవడంతో అక్రమార్కులు అడ్డదారుల్లో ఎగబడుతున్నారు. స్థానిక నాయకుల అండతో ఇసుక తరలిస్తున్నారు. నదిలో రాత్రివేళ తవ్వకాలు జరిపి తీరానికి తీసుకొచ్చి చిన్నచిన్న బస్తాల్లో విక్రయానికి సిద్ధం చేస్తున్నారు.

కొత్త పాలసీలో భాగంగా ఇప్పటి వరకు సుమారు 48 సొసైటీలకు జిల్లాలో అవకాశం కల్పించారు. ఇంకా ఈ ప్రక్రియ పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చలేదు. దీంతో ఇసుక ఎక్కడా అందుబాటులో లేదు. స్టాక్ పాయింట్లలోనూ ఇదే పరిస్థితి. పశ్చిమ గోదావరి జిల్లా పెండ్యాల వద్ద మాత్రమే కొంతమేర అందుబాటులో ఉంది. దీంతో గోదావరిలో ఇసుక దొంగలు బయలు దేరారు. –న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

నగరంలో..

అర్జున్ పరిధి కోటిలింగాల రేవు, గాయత్రి ర్యాంపుల వద్ద ఇసుకను సిమెంటు బస్తాల్లో తరలించేస్తున్నారు. రాత్రి, పగలు నిర్విరామంగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఒక్కొక్క బస్తా రూ. వందకు పైగా విక్రయిస్తున్నారు. సొంత అవసరాలకు ఎవరైనా ఎడ్ల బండితో ఇసుక తీసుకెళ్లేందుకు ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దాన్ని ఆసరాగా చేసుకుని అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. వీరికి స్థానిక రాజకీయ నాయకులు తోడవ్వడంతో అడిగేవారే లేనట్టుగా కొంత మంది గ్రూపులుగా ఏర్పడి ఇసుక తరలిస్తున్నారు.



కోటిలింగాల రేవు వద్ద ఇసుకను బస్తాల్లో తరలింపు

గ్రామీణ పరిధిలో..

కాతేరు దాటిన తర్వాత గోదావరి తీరంలోని కొందరు రాత్రి సమయాల్లో డ్రెజ్జింగ్ బోట్ల సాయంతో ఇసుకను బయటకు తీసుకొస్తున్నారు. వారి సొంత స్థలాల్లో ఇసుకను డంప్ చేయడంతోపాటు ట్రాక్టర్లలో తరలించేస్తున్నారు. గత ప్రభుత్వంలో ఇష్టానుసారంగా డ్రెడ్జింగ్ చేసి ఇసుక అక్రమంగా తరలించిన అక్రమార్కులు మళ్లీ తమ దందా మొదలు పెట్టారు.

అనుమతుల ఆలస్యంతో..

అవసరాలకు సరిపడా ఇసుక సరఫరా లేకపోవడంతో దొడ్డి దారిన తరలించి అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. 14 మంది అధికారుల బృందం సొసైటీల పరిశీలనకి అనుగుణంగా అనుమతులు ఇవ్వాల్సి ఉంది. పరిశీలన లేకుండా ఇవ్వాలంటూ పలువురు పట్టుబడుతున్నారు. దీంతో అనుమతుల విషయంలో యంత్రాంగం వెనకడుగు వేస్తోంది. ఉన్నతాధికారులతో చర్చించిన తర్వాతే దీనిపై తగు నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించడంతో ప్రక్రియ కాస్త ఆలస్యమవుతోంది. ఈలోగా ఇసుక దొంగలు చెలరేగిపోతున్నారు.

చలనచిత్రాలు: **దానవాయిపేట:** శ్యామల, రాజా, వీఎస్ మహల్, అశోక, కుమారి, సూర్య ప్యాలస్, అప్సర: **దేవర,** అనుశ్రీ: **స్వాగ్,** సూర్య మినీ: **దక్షిణ,** శివజ్యోతి: **రామ్‌నగర్ బన్నీ,** స్వామి: **జోకర్,** రంభ: **కలి,** ఊర్వశి: **సత్యం సుందరం,** మేనక: **మత్తు వదలరా–2, మిస్టర్ సెలబ్రిటీ**(రెండు ఆటలు).



హర్షితకు లాప్‌టాప్ బహూకరించిన రోటరీ క్లబ్ రాజమండ్రి ప్రతినిధులు

విద్యార్థినికి ల్యాప్‌టాప్ బహూకరణ

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: జేఎన్‌రోడ్డులోని ఏకేసీ హాలులో రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్‌సిటీ అధ్యక్షుడు నాళం నరసింహారావు నిరుపేద విద్యార్థినికి ల్యాప్‌టాప్ బహూకరించారు. శనివారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమంలో రొటేరియన్ల సహకారంతో బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్న హర్షితకు లాప్‌టాప్ అందజేశారు. తండ్రి చనిపోయి దృష్టి లోపంతో బాధపడుతున్న తల్లితో జీవిస్తూ మెరిట్‌తో చదువుతున్న తనకు క్లబ్ తరపున లాప్‌టాప్ అందించడం ఆనందంగా ఉందని విద్యార్థినికి తెలిపారు. సీహెచ్.ప్రసాదరెడ్డి, లచ్చిరెడ్డి శ్రీనివాస్, నూలి శివ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలతో క్లబ్ సభ్యులు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో అండర్-10, 13, 15, 19 విభాగంలో బాల బాలికలకు బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం జరిగాయి. నారాయణపురంలోని రాజమహేంద్రవరం సిటీ బ్యాడ్మింటన్ క్లబ్‌లో జరిగిన ఈ పోటీలకు సుమారు 70మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహించి విజేతలకు క్లబ్ అధ్యక్షులు ఇమ్మని వెంకట్, కార్యదర్శి సురేష్ ఉదయగిరి, మద్దూరి శంకర్ తదితరులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విజయ్, కార్తీక్, తీగల రాజా తదితరులు పాల్గొన్నారు.



డ్రైనేజీపై సరిగా లేని పలకలు

కాస్త ఇటు చూడండి..!

ఏ.వి.ఏ రోడ్డు, న్యూస్‌టుడే: నగరంలో ఐఎల్‌టీడీ సెంటర్ నుంచి కోటిపల్లి బస్టాండ్‌కు వెళ్లే రహదారి నందు డ్రైనేజీపై పలకలు చాలా చోట్ల లేకుండా దర్శనమిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో పాక్షికంగా తొలగించి ఉండగా.. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారి కావడంతో ఇక్కడ ప్రమాదకరంగా మారింది. ఫుట్‌పాత్‌పై పాదచారుల సంచారం ఎక్కువగా ఉన్న క్రమంలో అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



శ్యామల సెంటరులో..



కృష్ణరావుపేటలో జలదిగ్బంధంలో వీధులు



కోటిపల్లి బస్టాండ్ రోడ్డులో

వర్షానికి జలమయం

ముంపు పీడ వీడేదెప్పుడు..?

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ, ఏ.వి.ఏ రోడ్డు, న్యూస్‌టుడే: నగరంలో కాస్త వర్షానికే పూర్తిగా జలమయమవుతోంది. చారిత్రక రాజమహేంద్రవరాన్ని ముంపు సమస్య ఏళ్ల తరబడి పట్టి వీడిస్తోంది. ఆదివారం సాయంత్రం ఒక్క సారిగా కురిసిన వర్షానికి రోడ్లు పూర్తిగా జలమయమయ్యాయి. మోకాటి లోతు నీరు నిలిచిపోయింది. ఆర్యాపురం, తుమ్మలావ, కోటిపల్లి బస్టాండు, ఆల్కాట్‌గార్డెన్స్, విఎల్‌పురం, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో ఈ పరిస్థితి నెలకొంది. నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో గంటల తరబడి జనం రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.

ఎన్నాళ్ల వరకూ..


నగరంలో ముంపు సమస్య పరిష్కరించేందుకు తలపెట్టిన పనులు ఇంకా పూర్తి కాలేదు. ముఖ్యంగా ప్రధాన కాలువల విస్తరణ పనులు జరగాల్సి ఉంది. ఎగువ కోట గుమ్మం నుంచి డీలక్స్ సెంటర్ వరకూ అండర్ గ్రౌండ్ కాలువ నిర్మాణాన్ని రూ.7 కోట్లతో ప్రతిపాదించారు. దీనిలో భాగంగా మెయిన్ రోడ్డును విస్తరించాల్సి ఉంది. ఆ పనులు ముందుకు సాగడం లేదు. ఇక కోటిపల్లి బస్టాండ్ నుంచి ఆల్కట్‌గార్డెన్స్ మీదుగా రైల్వే రోడ్డులో కాలువ విస్తరణకు రైల్వే సంస్థకు చెందిన స్థల సేకరణ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. దక్షిణ మధ్య రైల్వేకు చెందిన స్థలాన్ని ఇచ్చేందుకు ఆ శాఖ ముందుకు వచ్చింది. పది అడుగుల చొప్పున 500 మీటర్లు పొడవు వరకూ స్థల సేకరణకు సిద్ధపడ్డారు. అయితే ప్రత్యామ్నాయంగా వేరొక చోట స్థలం కేటాయింపు చేయాల్సి ఉంది. అది పూర్తయితే గాని పనులు చేపట్టేందుకు అవకాశం లేదు. ఇక ఆర్యాపురం, తుమ్మలావ ప్రాంతాల్లో కాలువల విస్తరణ పనులు చేపట్టగా పనులు అసంపూర్తిగా ఉన్నాయి. దీనిలో భాగంగా దేవీచౌక్ నుంచి గోకవరం బస్టాండ్ మీదుగా కాలువ నిర్మాణం జరిగింది. వీటిని అనుబంధంగా ఆర్యాపురం మీదుగా ఆదెమ్మదిబ్బ, కృష్ణానగర్ మీదుగా ఎస్ఆర్‌సీపీ ప్లాంటు వరకూ నిర్మాణంలో ఉన్న కాలువ కూడా పూర్తి కావాల్సి ఉంది. ఇక కంబాలచెరువు రోడ్డు నుంచి కోరుకొండ రోడ్డు వైపు నిర్మించాల్సిన కాలువ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. రానున్న పుష్కరాలను దృష్టిలో పెట్టుకొని ఈ పనులు వేగవంతం చేయాల్సిన ఆవశ్యకత ఉంది. వాస్తవానికి గతంలో అమృత్ స్కీమ్‌లో ఈ పనులు తలపెట్టగా కరోనా కారణంగా నిధులు పూర్తి స్థాయిలో విడుదల కాలేదు.



కుండపోతగా కురుస్తున్న వర్షం

సిద్ధివినాయకస్వామిని దర్శించుకున్న అధికారులు

అయినవిల్లి, న్యూస్‌టుడే: సిద్ధివినాయకస్వామివారిని ఆదివారం రాజమహేంద్రవరం ఈపీఎఫ్ జేసీ వైడీ ప్రసాద్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ అర్చకుడు వినాయకరావు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.



ఈపీఎఫ్ జేసీ ప్రసాద్

నేడు పరిష్కార వేదిక

టి.నగర్, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పరిష్కార వేదిక జరగనుంది. కమిషనర్ కేతన్ గర్గ్ పాల్గొని బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారు.

సిరుల తల్లి.. కల్పవల్లి..

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం నగరంలోని పలు ఆలయాల్లో దసరా సంబరాలు వైభవంగా జరుగుతున్నాయి. గోదావరిగట్టున ఉన్న శ్రీఉమామార్కండేయస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకం, పార్వతీదేవి అమ్మవారికి పట్టువస్త్రాలతో అలంకారం, కుంకుమార్చన నిర్వహించారు. అమ్మవారి ఉత్సవమూర్తికి శ్రీలలితాదేవి అవతారంలో అలంకరించి సహస్రనామ పారాయణం పఠించారు. శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారికి బాదం, సన్‌ఫ్లవర్ గింజలతో అలంకరించి కుంకుమార్చన చేశారు. సీతంపేట రామాలయంలో మహాలక్ష్మీదేవి అమ్మవారికి పట్టువస్త్రాలతో అలంకరించి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రీశృంగేరీ శారదా పీఠంలో అమ్మవారికి వివిధ రకాల పూలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. గోదావరిగట్టున ఉన్న శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో చండీ హోమం జరిగింది. జాంపేట శ్రీకనకదుర్గాదేవి అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి కుంకుమ పూజలు జరిపించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. వంకాయల వారి వీధిలోని శ్రీఅష్టలక్ష్మీ అమ్మవారి ఆలయంలో లక్ష్మీనారాయణులకు విశేష పూజలు, గజలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక అలంకరించారు. భక్తులు ఆయా ప్రాంతాల్లోని ఆలయాల్లో అమ్మవారిని దర్శించుకున్నారు. గోదావరిగట్టున ఉన్న శ్రీత్యాగరాజ నారాయణదాస సేవాసమితి ప్రాంగణంలో, సరస్వతీఘాట్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భారీ విద్యుద్దీప కాంతులతో దేవీచౌక్ ప్రాంతం దేదీప్యమానంగా కనిపిస్తోంది. శ్రీమహాలక్ష్మీదేవి అవతారంలో దేవీచౌక్ అమ్మవారు దర్శనమిచ్చారు. పాకం పూరీలు నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ఆవరణలో 108 మంది దంపతులతో అర్చకులు శాస్త్రోక్తంగా సామూహిక పూజలు చేయించారు. నేడు దేవీచౌక్‌లో శ్రీబాలా త్రిపుర సుందరీదేవి అలంకారం.. రాత్రి 10గంటలకు శ్రీసత్య హరిశ్చంద్ర నాటక ప్రదర్శన ఉంటుంది.



మార్కండేయస్వామి ఆలయంలో.. ● శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో.. ● శ్రీశృంగేరీ శారదాపీఠంలో.. ● జాంపేటలో ● అష్టలక్ష్మీ ఆలయంలో..



విద్యుద్దీపకాంతులతో దేవీచౌక్, భక్తుల రద్దీ

సొంతూర్లకు పయనం..
రద్దీగా ప్రయాణ ప్రాంగణాలు

వి.ఎల్.పురం (రాజమహేంద్రవరం): దసరా పండగకు సొంతూర్లు, బంధువుల ఇళ్లకు బయలుదేరే ప్రయాణికులతో ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో రద్దీ కొనసాగుతోంది. ఆదివారం కావడంతో ఎక్కువ మంది ఊర్లకు పయనమయ్యారు. దీంతో ప్రయాణ ప్రాంగణాలు ప్రయాణికులతో కిటకిటలాడాయి. పెరిగిన రద్దీకి అనుగుణంగా అదనపు సర్వీసులు తిప్పుతున్నట్లు ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా విశాఖపట్నానికి రద్దీ మరింత ఎక్కువగా ఉంది. రాజమహేంద్రవరం డిపో నుంచి నిత్యం ఏడు షెడ్యూల్ సర్వీసులు ఈ మార్గంలో నడుస్తుండగా. . ఆదివారం మూడు అదనపు సర్వీసులు ఏర్పాటు చేశారు. కాకినాడ నాన్‌స్టాప్ సర్వీసులుగా రాజమహేంద్రవరం నుంచి తొమ్మిది బస్సులు నడుస్తుండగా ప్రస్తుతం వీటిలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నిడదవోలు, కొవ్వూరు డిపోల నుంచి రాజమహేంద్రవరం వచ్చి వెళ్లే పల్లెవెలుగు సర్వీసులు సైతం ప్రయాణికులతో కిక్కిరిసి కనిపిస్తున్నాయి.

★ రేపటి నుంచి ప్రత్యేక బస్సులు: హైదరాబాద్ నుంచి జిల్లాలోని సొంతూర్లకు వచ్చే ప్రయాణికుల కోసం నాలుగు డిపోల్లో ఈనెల 8 నుంచి 11వ తేదీ వరకు మొత్తం 37 ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపనున్నారు. దీనికోసం ఇప్పటికే బస్సులు సిద్ధం చేశారు. రాజమహేంద్రవరం డిపో నుంచి సోమవారం రాత్రి మూడు ప్రత్యేక బస్సులను హైదరాబాద్‌కు పంపిస్తున్నారు. ఇవి మంగళవారం హైదరాబాద్‌లో ప్రయాణికులను ఎక్కించుకుని జిల్లాకు చేరుకుంటాయని డిపో అధికారులు తెలిపారు. జిల్లాలోని ఆయా డిపోల నుంచి 9వ తేదీన 7, 10న 10, 11న 15 హైదరాబాద్ ప్రత్యేక సర్వీసులుగా నడుస్తాయని అధికారులు తెలిపారు.

★ జిల్లా మీదుగా రెండు ప్రత్యేక రైళ్లు: అలాగే, ప్రయాణికుల రద్దీ దృష్ట్యా జిల్లా మీదుగా రెండు ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేశారు. కాకినాడ-సికింద్రాబాద్ (07071) ప్రత్యేక రైలు ఆదివారం రాత్రి 9 గంటలకు కాకినాడలో బయలుదేరి 10.22 గంటలకు రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్‌కు, 10.37 గంటలకు నిడదవోలుకు చేరుకుంటుందని రైల్వే అధికారులు తెలిపారు. సికింద్రాబాద్-కాకినాడ (07072) ప్రత్యేక రైలు సోమవారం రాత్రి 7 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి మంగళవారం తెల్లవారుజాము 5.59 గంటలకు రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్‌కు వస్తుందని తెలిపారు.



నిడదవోలు వైపు వెళ్లే బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

పొంచి ఉన్న ముప్పు



స్థానిక కోటిపల్లి బస్టాండ్ ఏరియాలో రహదారి చెంతనున్న భూగర్భ డ్రెయిన్ మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. దీనిపై ఉన్న ఇనుప మూత ఒక పక్క వెల్డింగ్ ఊడిపోయి ఉండటంతో ప్రమాదం పొంచి ఉంది. ఆదమరుపుగా ద్విచక్రవాహనచోదకులు దీనిపై నుంచి వెళితే పడిపోయే అవకాశం ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించాల్సి ఉంది. – న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

భాజపాలో పలువురి చేరిక

దేవీచౌక్: రాజానగరం మండలం పాలచర్ల, రఘునాధపురం గ్రామాలకు చెందిన 50 మంది ఆదివారం భాజపా జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు సమక్షంలో ఆ పార్టీలో చేరారు. రాజమహేంద్రవరంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ భాజపా సిద్ధాంతాలు నచ్చి ఇటీవల పలువురు పార్టీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారు నిబద్ధత, క్రమశిక్షణతో నిస్వార్థంగా పనిచేయాలని సూచించారు. విశాఖ ఉక్కు పరిశ్రమ విషయంలో కేంద్ర పరిశ్రమల శాఖామంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్నట్లు చెప్పారని సోమువీర్రాజు ఒక ప్రశ్నకు సమాధానంగా స్పష్టం చేశారు.



పార్టీలో చేరిన వారితో సోము వీర్రాజు

లారీ ఢీకొని ఒకరికి గాయాలు

రాజమహేంద్రవరం నేరవార్తలు: స్పినింగ్‌మిల్లు కాలనీకి చెందిన పి.ప్రతాప్ రెడ్డి ఆదివారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై లాలాచెరువు కూడలి దాటుతున్న తరుణంలో ఓ లారీ ఢీ కొంది. ఆ ప్రమాదంలో అతడి కాలుకు తీవ్ర గాయం కాగా.. నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ మేరకు ఆసుపత్రి వర్గాలు బొమ్మూరు పోలీసులుకు సమాచారం ఇచ్చారు.

ద్విచక్ర వాహన ప్రమాదంలో..

పీఅండ్‌టీ కాలనీకి చెందిన సీహెచ్.రామానుజం శనివారం రాత్రి కోరుకొండ రోడ్డు బిజిలీ ఐస్ ఫ్యాక్టరీ సమీపంలో రోడ్డు దాటుతున్న తరుణంలో ఓ ద్విచక్ర వాహనం ఢీకొంది. ఆ ప్రమాదంలో అతడి తలకు గాయం కావడంతో నగరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఆసుపత్రి వర్గాల సమాచారంతో మూడో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

చోరీ కేసులో అంతర్ జిల్లా దొంగ అరెస్టు

రాజంపేట: రాజంపేట పట్టణం కృష్ణానగర్‌లో గత నెల 21న ఓ ఇంట్లో జరిగిన చోరీ కేసుకు సంబంధించి అంతర్ జిల్లా దొంగను అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ సుధాకర్‌బాబు తెలిపారు. కృష్ణానగర్‌లో వేములపల్లి విజయ్‌కుమార్ అనే యువకుడు చోరీకి పాల్పడి బంగారు నగలు, నగదును తీసుకెళ్లాడు. ఫిర్యాదు మేరకు ఈ నెల 5న నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ.6.93 లక్షలు విలువ చేసే 138.76 గ్రాముల బంగారు, రూ.9,650 స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు. నిందితుడు విజయకుమార్‌పై వివిధ పోలీస్‌స్టేషన్లలో 41 దొంగతనం కేసులున్నట్లు చెప్పారు. గడిచిన రెండేళ్లలో సామర్లకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు, రాజమహేంద్రవరం పరిధిలో రెండు, అనపర్తి పరిధిలో రెండు కేసులు ఉన్నట్లు వివరించారు.

ఆల్కాట్ గార్డెన్.. సమస్యల డెన్..

చిన్నపాటి వర్షానికీ తప్పని ముంపు

దానవాయిపేట, న్యూస్‌టుడే: అటు వేమగిరి.. ఇటు బొమ్మూరు.. జాతీయ రహదారిపై నుంచి నగరంలోని ప్రవేశించాలంటే ముఖద్వారంగా ఉన్న 18, 19, 20 డివిజన్లలోని ముఖ్యప్రాంతం ఆల్కాట్‌గార్డెన్. మూడు డివిజన్ల పరిధిలో ఈ ప్రాంతానికి సంబంధించిన అనేక వీధులు ఉంటాయి. సుమారు 15 నుంచి 17 వేల జనాభా ఉన్నా ఇక్కడ ఏళ్ల తరబడి సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ఎంతకూ పరిష్కారానికి నోచుకోక జనం ఇబ్బంది పడుతున్నారు. ఉద్యానవనం ఊసే లేకపోగా.. గోదావరి నది ప్రవాహానికి దిగువగా ఈ ప్రాంతం ఉండటంతో మురుగు బయటకు వెళ్లకపోగా.. వర్షపునీరు తిరిగి ఈ స్థలంలోకే చేరుతూ జనం ఇబ్బంది పడుతున్నారు. 2017-18లో అప్పటి నగర కమిషనర్ విజయరామరాజు నేతృత్వంలో గూడ్స్ గేటు సమీపంలో ప్రధాన మురుగు కాలువ వద్ద రెండు భారీ నీటి ఇంజన్లు వర్షపునీరు తోడటం చేసిన ఉదంతాలు ఉన్నాయి. ఓ షెడ్డు వేసి కార్మికుడిని నియమించినా కాలాంతరంలో అవి కనుమరుగయ్యాయి. ఇప్పటికీ ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కరవైంది. డ్రైనేజీల్లో సిల్టు తొలగించకపోవడం మరింత ఇబ్బందిగా మారింది.



రైల్వేస్టేషన్ ఎదురుగా ఇలా..

లారీల రాకపోకలతో ఇబ్బందులు..

గోదావరి గట్టుకు ఆనుకుని ఉన్న నగర శివారు ప్రాంతాల్లో ఒకటి 18వ డివిజన్. దీనిలో కొంత నగరపాలక సంస్థ పరిధి, మరి కొంత ధవళేశ్వరం, పిడింగొయ్యి పంచాయతీ పరిధిలోకి వస్తుంది. ఆల్కాట్‌గార్డెన్స్, రత్న ప్లాస్టిక్ ప్రాంతం, ప్రభుత్వ అటవీ డిపో ప్రాంతాలు ఈ డివిజన్‌లోకి వస్తాయి. స్థానికంగా అనేక ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉండటం.. అదే మార్గాల్లో ఇసుక లారీలు వేగంగా వెళ్లడంతో అనేక మంది ప్రమాదాల బారినపడుతున్నారు.

రాత్రయితే భయమే..: ఆల్కాట్‌గార్డెన్ సుబ్బాయమ్మ ఘాట్ వద్ద నిత్యం ఆకతాయిలు ఉండటం.. మద్యం సేవించి సీసాలు గట్టుపై పగలగొట్టడం వంటివి సమస్యలతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకూ..: ఈ ప్రాంతానికి ఆనుకుని ఉన్న గోదావరి గట్టుపై రాత్రి 10 గంటలైతే అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. బ్లేడు బ్యాచ్, మద్యం బాబుల వేధింపులతో జనం అవస్థ పడుతున్నారు. వీధిదీపాలు వెలగకపోవడం సమస్యను జటిలం చేస్తోంది. ఇటీవల రోటరీ కైలాస భూమిలో అర్ధరాత్రి మద్యం సేవిస్తున్న ఓ రౌడీ షీటర్ తల పగలగొట్టి ప్రత్యర్థులు హత్యాయత్నం చేసిన ఉదంతం ఉంది.



విద్యుత్తు దీపాలు లేక చీకటిమయంగా గోదారిగట్టు వీధి

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

రైతుబజారులో నిన్నటి ధరలు(రూ.లో)

దేవీచౌక్: టమాట(రాయితీ)-58, వంకాయలు నలుపు-34/గులాబీ-48/తెలుపు-36/దొమ్మేరు-48, బెండ-34, కాకర-34, బీర పందిరి-48/40, దొండ-48, క్యారెట్-46/42, బీట్‌రూట్-34, గోరుచిక్కుళ్లు-38, దోస-30, ఆనబకాయ-32/30, చిక్కుళ్లు-76/దేశవాళీ-86, పచ్చిమిర్చి-24, బంగాళదుంపలు-32, ఉల్లిపాయలు-50/కొత్తవి-35

చలనచిత్రాలు: **దానవాయిపేట:** శ్యామల, రాజా, వీఎస్ మహల్, అశోక, కుమారి, సూర్యప్యాలస్, అప్సర: **దేవర,** అనుశ్రీ: **స్వాగ్,** సూర్యమినీ: **దక్షిణ,** శివజ్యోతి: **రామ్‌నగర్ బన్నీ,** స్వామి: **జోకర్,** రంభ: **కలి,** ఊర్వశి: **సత్యం సుందరం,** మేనక: **మత్తు వదలరా-2, మిస్టర్ సెలబ్రిటీ**(రెండు ఆటలు).

ఉపప్రణాళిక నిధుల పక్కదారిపై విచారణ చేపట్టాలి

సీతానగరం, న్యూస్‌టుడే: రఘుదేవపురం పంచాయతీలో 2014-19 మధ్యకాలంలో ఉపప్రణాళిక నిధులు పక్కదారి పట్టడంపై సమగ్ర విచారణ చేపట్టాలని ఎంపీటీసీ సభ్యుడు పంతుల శ్రీను, ప్రస్తుత పాలకవర్గ సభ్యులు పిండి రాధాకృష్ణ, లగులాపు మల్లేశ్వరరావు, పిసిని భవాని తదితరులు కోరారు. ఆదివారం స్థానిక పంచాయతీలో వారంతా సమావేశయ్యారు. అప్పట్లో ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక నిధులను వేరే వర్గాలకు ప్రాధాన్యనిస్తూ పక్కదారి పట్టించారన్నారు. రికార్డుల్లో మాత్రం నిధులన్నీ ఆయా వర్గాలకే కేటాయించినట్లు చూపించాన్నారు. దీనిపై ఆధారాలతో సహా అధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు లేవన్నారు.

నిరుపయోగంగా మేకప్ చెరువు


హుకుంపేటలో గుర్రపుడెక్క, మురుగుతో నిండి ఉన్న మేకప్ చెరువు

హుకుంపేట, న్యూస్‌టుడే: గ్రామాల్లో చెరువులు పొలాలకు, ఇంట్లో అవసరాలకు అన్ని విధాలుగా ఉపయోగకరంగా ఉండాలి. కానీ హుకుంపేట పంచాయతీ పరిధిలో మేకప్ చెరువు దీనికి భిన్నంగా ఎవరికీ ఎటువంటి ఉపయోగం లేకుండా నిరుపయోగంగా ఉంది. గతంలో 6.8 ఎకరాలు ఉండే చెరువు స్థలం కబ్జాలకు గురవడంతో ప్రస్తుతం 4 ఎకరాలు మాత్రమే ఉందని అంటున్నారు. పశువులకు తాగునీటికి, గ్రామంలోని రజకులు బట్టలు ఉతికేందుకు ప్రయోజనకరంగా ఉండేదని ప్రస్తుతం ఎవరికీ ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


గతేడాది ఏర్పాటుచేసిన శిలాఫలకం తుప్పల్లో ఇలా..

ప్రతిపాదనలే తప్ప పనులు జరగలేదు..

గత ఏడాది అమృత్‌సరోవర్‌లో భాగంగా చెరువును సుందరీకరించేందుకు చెరువు మొత్తం శుభ్రపరచడం, చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టడం, వాకింగ్ ట్రాక్ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కానీ నేటికీ ఎటువంటి పనులు ప్రారంభించ లేదు. చెరువు నిండా గుర్రపుడెక్క నిండి అస్తవ్యస్తంగా ఉంది. మురుగు, చెత్తా చెదారాలు చేరి దుర్వాసన వ్యాపిస్తుందని, జంతు కళేబరాలు సైతం ఇక్కడే తెచ్చి వేస్తున్నారని గ్రామస్థులు తెలిపారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

డివిజన్ వెతలు

గత ఆరేళ్ల నుంచి ఇదే పరిస్థితి..

ఒకప్పుడు చెరువు నిండా నీటితో ఉండి రైతులు, రజకులు వారి అవసరాల నిమిత్తం వినియోగించుకునే వారు. ఎప్పుడూ చూసేందుకు ఆహ్లాదంగా కనిపించేది. కానీ ఇప్పుడు ఇక్కడకు రావాలంటేనే భయం వేస్తుంది. ఆరేళ్లగా ఇదే పరిస్థితి నెలకొన్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

– జి.నాగు, హుకుంపేట

ఉపయోగకరంగా తీర్చిదిద్దుతాం

గత ఏడాది ఎనిమిది లక్షలతో పనులు చేపట్టాం. అమృత్ సరోవర్‌లో భాగంగా చెరువును మళ్లీ శుభ్రపరచి వాకింగ్ ట్రాక్, ప్రహరీ నిర్మాణం వంటి పనులు ప్రారంభిస్తాం. ఉన్నతాధికారులకు నివేదిక పంపించి, నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం.

– శ్రీనివాస్, ఎంపీడీవో, హుకుంపేట


బొమ్మూరులో అన్నపూర్ణ అవతారంలో..


బాలాజీపేట కూడలిలో..


కొంకుదురు విజయదుర్గ..


బాలాత్రిపురసుందరిగా..


కడియపులంక అపర్ణాదేవి

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు

ఆధ్యాత్మికం

బొమ్మూరు, హుకుంపేట, బిక్కవోలు, కడియం, రాజానగరం, గోకవరం, న్యూస్‌టుడే: బొమ్మూరు నేతాజీనగర్ కనకదుర్గ ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణ అవతారంలో అలంకరించారు. మధ్యాహ్నం ముగ్గులపోటీలో యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ● శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా నాల్గవ రోజు బాలాజీపేట, తూర్పు రైల్వేస్టేషన్ సమీపంలో కనకదుర్గ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా పట్టు వస్త్రాలతో అలంకరించారు. ● కొంకుదురు గోపాలరామానాయుడు వీధిలోని విజయదుర్గా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ● కడియపులంకలో కొలువైన అపర్ణాసమేత అనంతేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. కడియంలో శ్రీదేవి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ● వేమగిరితోటలో కొలువైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఆదివారం ఉదయం దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకుని వేద మంత్రోచ్చారణల మధ్య చండీయాగంను ప్రముఖ అర్చకుడు కొత్తూరి సతీశ్‌శర్మ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, మాజీ సర్పంచి డాక్టర్ వెలుగుబంటి వెంకటాచలం, రఘురామ్ పాల్గొన్నారు. ● రాజానగరంలో వెలిసిన రాజరాజేశ్వరి అమ్మవారు బాలాత్రిపురసుందరీదేవి అలంకరణలో ఆకట్టుకున్నారు.


వేమగిరి చండీయాగంలో పాల్గొన్న భక్తులు

అగ్నిగుండంలో అడుగులు



బిక్కవోలు: దేవి ఉత్సవాల్లో భాగంగా భవానీ మాలలు ధరించిన భక్తులు అగ్నిగుండాలు తొక్కటం ఆనవాయితీ. బిక్కవోలు మండలంలోని పందలపాక వెలంపేట రామాలయం వద్ద అమ్మవారి మాలలు ధరించిన భక్తులు ఆదివారం ఉదయం అగ్నిగుండంలో నడిచారు.

మేమున్నాం.. మీకు తోడుగా

తాగునీరు వృథా

సమస్య: బొమ్మూరు కాళీకృష్ణనగర్ మూడో వీధిలో పైపులైను పగిలి రెండు రోజుల నుంచి తాగునీరు వృథాగా పోతుంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– వెంకట్, స్థానికుడు

సమాధానం: పైపులైనుకు మరమ్మతులు చేయించి నీటి వృథాను నియంత్రిస్తాం.

– శ్రీనివాసరెడ్డి, కార్యదర్శి

- న్యూస్‌టుడే, బొమ్మూరు

సమస్య: బిక్కవోలు ఎస్.సి. పేట అంబేడ్కర్ విగ్రహం వద్ద పైపులైనుకు రంధ్రం పడింది. దీంతో ట్యాంకు నుంచి నీరు వదిలినప్పుడల్లా వృథాగా పోతుంది.

– సుబ్బారావు, బిక్కవోలు

సమాధానం: ఈ సమస్య మా దృష్టిలో ఉంది. ఒకటి రెండు రోజుల్లేనే సమస్య పరిష్కరిస్తాం.

– ఆర్. శ్రీలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి

- న్యూస్‌టుడే, బిక్కవోలు

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: **91212 29057,** కడియం: **91212 29062,** అనపర్తి: **91000 20947**

తనకాలకు విశిష్ఠ సేవా పురస్కారం

కోరుకొండ, న్యూస్‌టుడే: తెదేపా సీనియర్ నాయకుడు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ తనకాల నాగేశ్వరరావు విశిష్ఠ సేవా పురస్కారం అందుకున్నారు. రాజమహేంద్రవరం ఆనంద్ రీజెన్సీలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని గోదావరి టాలెంట్ టెస్ట్ వారు నిర్వహించిన ఓ కార్యక్రమంలో ప్రముఖుల చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పురస్కారంతో తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు

శ్యామలా సెంటర్, న్యూస్‌టుడే: రోటరీక్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ ఆధ్వర్యంలో అండర్-10, 13, 15, 19 విభాగంలో బాల బాలికలకు బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం జరిగాయి. నారాయణపురంలోని రాజమహేంద్రవరం సిటీ బ్యాడ్మింటన్ క్లబ్‌లో జరిగిన ఈ పోటీలకు సుమారు 70 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహించి విజేతలకు క్లబ్ అధ్యక్షులు ఇమ్మని వెంకట్, కార్యదర్శి సురేష్ ఉదయగిరి, మద్దూరి శంకర్ తదితరులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విజయ్, కార్తీక్, తీగల రాజా తదితరులు పాల్గొన్నారు.

వెలుగు సిబ్బందిపై చర్యలు కోరుతూ వినతి

కడియం, న్యూస్‌టుడే: కడియపులంక పరిధి పది క్లస్టర్లలకు సంబంధించి డ్వాక్రా బృందాల నిధులను వెలుగు సిబ్బంది గోల్‌మాల్‌కు పాల్పడ్డారని వారిపై చర్యలు తీసుకోవాలని డ్వాక్రా మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. డ్వాక్రా రుణాల్లో రూ. లక్షల్లో అవకతవకలు జరిగినా వెలుగు అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. లోటుపాట్లపై చర్యలు కోరుతూ ఆ శాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల స్పందిస్తూ డ్వాక్రా రుణాల నిధుల మళ్లింపునకు కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇన్‌ఛార్జి సర్పంచి పాటంశెట్టి రాంజీ, పలు డ్వాక్రా సంఘాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

సినిమాల పల్లె.. ఈ దోసకాయలపల్లి

సినీ గోదారి


ఎక్కువ సినిమాలు చిత్రీకరించిన మునసబువారి ఇల్లు

సినీ పరిశ్రమలో ఓ మారుమూల పల్లె పేరు ఎప్పుడూ వినిపిస్తూనే ఉంటుంది. ఈ పల్లెకి.. సినిమా వాళ్లకి ఎంతో అవినాభావ సంబంధం ఉంది. అందుకే చిత్రీకరణల నిలయంగా పిలుస్తుంటారు. అదే కోరుకొండ మండలంలోని దోసకాయలపల్లి. - న్యూస్‌టుడే, కోరుకొండ

అప్పుడు.. ఇప్పుడు

దోసకాయలపల్లి సినిమా చిత్రీకరణలకు పెట్టింది పేరు. జిల్లాలో చిత్రీకరణలంటే మొదటిగా గుర్తుకొచ్చేది ఈ గ్రామమే. నాటి దేవత సినిమా నుంచి తాజాగా రామ్‌చరణ్ నటిస్తున్న గేమ్‌ఛేంజర్ వరకు ఇక్కడ ఎన్నో చిత్రీకరించారు. స్థానికులు కొంతమంది సినీ పెద్దలతో సత్సంబంధాలు కలిగి ఉన్నారు. అక్కినేని నాగేశ్వరరావు, చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, కృష్ణంరాజు, మురళీమోహన్, అల్లరి నరేష్, సునీల్.. ఇలా పాత, కొత్త కథానాయకులు, నటీనటులు ఎంతో మంది ఇక్కడికి వచ్చినవారే.

ఎంతో అనుకూలంగా..

ఈ గ్రామంలో ఇళ్లు, రోడ్లు, పొలాలు, తోటలు పలు సినిమాల చిత్రీకరణకు అనుకూలంగా ఉండటం విశేషం. పాత తరం నాటి మండువా ఇళ్లు ఇంకా ఉన్నాయి. సినిమావాళ్లను ఇవి ఇప్పటికీ ఆకర్షిస్తూనే ఉంటాయి. ప్రధానంగా గ్రామస్థుల సహకారం ఎక్కువగా ఉండటం పూర్వం నుంచీ ఆనవాయితీగా వస్తోంది. అందుకే ఈ గ్రామంపై అభిమానం ఎక్కువ. ఎవరి పని వాళ్లు చేసుకుంటుంటారు. ఎలాంటి ఇబ్బంది పడరు. పైగా పెద్దలు అన్ని విధాలుగా సహకారం అందిస్తుంటారు. ఆనాడు పెద్ద హీరోలు కూడా గ్రామంలోని మునసబువారి ఇంటిలోనే బస చేసేవారు. వారికి అన్నిరకాల మర్యాదలు చేసేవారని ఇప్పటికీ చెబుతుంటారు. మునసబువారి ఇంట్లోనే ఏకంగా 50కి పైగా సినిమాలు చిత్రీకరించడం విశేషమని స్థానికులు చెబుతుంటారు.


ఆనాటి మండువా ఇల్లు ఇప్పటికీ ఇలా..

మృత్యుకుహరాల్లా గుంతలు

వేమగిరి నుంచి కడియం వెళ్లే కాకినాడ బైపాస్ రహదారి మృత్యుదారిగా మారిందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు అయిదేళ్లుగా ఈ దారిలో ఏర్పడిన గుంతలకు తట్టెడు మట్టి పోసిన దాఖలాలు లేవని వాపోతున్నారు. నిత్యం వేలాది వాహనాలు తిరిగే క్రమంలో పలువురు ద్విచక్రవాహన దారులు క్షతగాత్రులుగా మారుతున్నారంటున్నారు. ఇటీవల ఈ గుంతల్లో ఆటో బోల్తాకొట్టింది. ఇదే దారిలో గతంలో వేర్వేరు ప్రమాదాల్లో ఓ యువకుడు, వ్యవసాయ రైతు మృత్యువాతపడ్డారు.



దీనిపై ర.భ.శాఖ ఏఈ సత్యనారాయణను వివరణ కోరగా త్వరలో మరమ్మతు చర్యలు చేపడతామన్నారు.

- న్యూస్‌టుడే, కడియం

చోరీ కేసులో అంతర్ జిల్లా దొంగ అరెస్టు

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేట పట్టణం కృష్ణానగర్‌లో గత నెల 21న ఓ ఇంట్లో జరిగిన చోరీ కేసుకు సంబంధించి అంతర్ జిల్లా దొంగను అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ సుధాకర్‌బాబు తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఆయన వెల్లడించారు. కృష్ణానగర్‌లో వేములపల్లి విజయ్‌కుమార్ అనే యువకుడు చోరీకి పాల్పడి బంగారు నగలు, నగదును తీసుకెళ్లాడు. ఫిర్యాదు మేరకు ఈ నెల 5న నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ. 6.93 లక్షలు విలువ చేసే 138.76 గ్రాముల బంగారు, రూ.9,650 స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు. నిందితుడు విజయకుమార్‌పై వివిధ పోలీస్ స్టేషన్లలో 41 దొంగతనం కేసులున్నట్లు చెప్పారు. గడిచిన రెండేళ్లలో సామర్లకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు, రాజమహేంద్రవరం పరిధిలో రెండు, అనపర్తి పరిధిలో రెండు కేసులు ఉన్నట్లు వివరించారు.

పరిశ్రమను మూసే వరకు పోరాడతాం

ఆందోళన బాట పట్టిన మహిళలు

గోకవరం, న్యూస్‌టుడే: గత వైకాపా హయాంలో సముద్ర తీరాల్లో నెలకొల్పాల్సిన పరిశ్రమలను ఇళ్లమధ్య పెట్టడమేంటని గోకవరం మండలం గుమ్మళ్లదొడ్డి, బావాజీపేట గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. అప్పటి సీఎం శంకుస్థాపన చేసి కాలుష్యం వెదజల్లే పరిశ్రమను పెట్టించారని మా బతుకులను ఏం చేద్దామనుకున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గోకవరం మండలం గుమ్మళ్ల దొడ్డిలో అస్సాగో ఇథనల్ పరిశ్రమ నుంచి పెద్దఎత్తున దుర్వాసన వస్తుండడంతో పరిసర గ్రామస్థులు అనారోగ్యం బారిన పడుతున్నారు. శనివారం రాత్రి నుంచి పరిశ్రమ గేటు ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్నారు. మండుటెండను లెక్కచేయకుండా గేటు బయట నినాదాలు చేశారు. గ్రామస్థుల అభిప్రాయాలిలా..


పరిశ్రమ వద్ద మహిళల ఆందోళన

అనారోగ్య సమస్యలు



ఈ పరిశ్రమ నుంచి వస్తున్న దుర్వాసనతో చిన్నారులు కడుపు నొప్పి, వాంతులతో ఇబ్బందులు పడుతున్నారు. ఒక ఎనిమిది నెలల గర్భిణి ఊపిరి ఆడక ఆసుపత్రిలో చేరారు. ఈ పరిశ్రమ ఉండడానికి వీల్లేదు. న్యాయం జరిగే వరకు మా పోరాటాన్ని కొనసాగిస్తాం.

- మద్దాల భవానీ

పరిశ్రమను మూసేయాలి



పరిశ్రమలో ఉత్పత్తి ప్రారంభమైనప్పటి నుంచి చాలా సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. పెద్దఎత్తున కాలుష్యం వెదజల్లడమే ఇందుకు ప్రధాన కారణం. అందుకే మండుటెండను లెక్కచేయకుండా ఆందోళనకు దిగుతున్నాం. పరిశ్రమను మూసేంత వరకు మా ఆందోళనను కొనసాగిస్తూనే ఉంటాం.

- షేక్ సైదమ్మ

ఊపిరి ఆడడం లేదు



నేను అసలే ఆస్తమాతో బాధపడుతున్నా. దీనికి తోడు ఈ పరిశ్రమ నుంచి వచ్చే దుర్వాసనతో ఊపిరి పీల్చుకోవడం కష్టంగా మారుతుంది. నాలుగు అడుగులు వేసే సరికి ఊపిరి ఆడక పడిపోతున్నాను. ఇప్పటికైన మాలాంటి వారి పరిస్థితినైన దృష్టిలో ఉంచుకొని పరిశ్రమ నిర్వహణతో తలెత్తే ఇబ్బందులను పరిష్కరించాలని వేడుకొంటున్నాం.

-బోడియ్య

ప్రజల సొమ్ము రాళ్ల పాలు!

భూముల రీ-సర్వేకు కూటమి కసరత్తు

సీతానగరం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం డ్రోన్ల సాయంతో చేపట్టిన భూముల రీ-సర్వేపై రైతులు తీవ్రంగా వ్యతిరేకించడమే కాకుండా సర్వేరాళ్లపై జగనన్నభూరక్ష పేరు కలిగిన రాళ్లు తమ భూముల్లో పాతేందుకు వీలులేందంటూ పలుచోట్ల అడ్డుకున్నారు. సర్వే రాళ్లపై వచ్చిన వ్యతిరేకతను అణగదొక్కేందుకు వైకాపా నాయకులు అప్పట్లో చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టాయి. ఈలోపుగా సార్వత్రిక ఎన్నికలు సమీపించడంతో వచ్చిన రాళ్లు అన్ని ఎక్కడ పడితే అక్కడ పడేశారు. ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా 263 గ్రామాల్లో వైకాపా హయాంలో రీ-సర్వే మొక్కుబడి తంతుగా ముగించారు. తూర్పుగోదావరిజిల్లాలోని సీతానగరం మండలం రామచంద్రపురంలో ఖాతా నంబర్లు, సర్వే నంబర్లు, భూముల విస్తీర్ణంలో వ్యత్యాసాలతో క్రయ విక్రయాల సమయంలో పలు ఇబ్బందులు ఇప్పటికీ పడుతున్నారు. ఎల్‌పీ నంబర్లలో ఉన్న విస్తీర్ణం ఆధారంగానే భూముల రిజిస్ట్రేషన్లు జరిగిపోవడం వివాదాలకు దారితీస్తోంది.


ముగ్గళ్ల వద్ద పక్కన పడేసిన సర్వేరాళ్లు

రీ-సర్వే తప్పులకు గ్రామసభలు!

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూముల రీ-సర్వే విధివిధానాల్లో మార్పులు తీసుకొచ్చేలా గత మూడునెలలుగా చేసిన కసరత్తు ఫలించింది. గత వైకాపా పాలనలో అస్తవ్యస్తంగా తయారైన రీ-సర్వేలో వచ్చిన తప్పులను సరిచేసేలా అవసరమైన కార్యాచరణ సిద్ధం చేసింది. తొలుత రీ-సర్వే పూర్తిచేసిన గ్రామాల్లో నష్టపోయిన రైతులను గ్రామసభల ద్వారా గుర్తించడం, వాటిని పరిష్కారం చేసిన తర్వాతనే సరైన పద్ధతుల్లో భూముల రీ-సర్వే చేపడతారు.

ఎంపీడీవోతో నాయకుల చర్చలు

రంగంపేట, న్యూస్‌టుడే: రంగంపేట ఎంపీడీవోగా వి.వి. సాయిబాబు బాధ్యతలు స్వీకరించగా ఇన్‌ఛార్జి ఎంపీడీవో పి. వెంకటరత్నం ఈవోపీఆర్డీగా కొనసాగుతున్నారు. ఆదివారం కొత్త ఎంపీడీవో సాయిబాబుతో భాజపా మండల అధ్యక్షుడు ఎం. సాయిరామ్, ఇతర నాయకులు కలిసి మండలంలోని పరిస్థితులను ఆయనకు వివరించారు.

పూర్వ విద్యార్థుల సమావేశానికి చర్చలు

బిక్కవోలు, న్యూస్‌టుడే: రాయవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1978లో పదోతరగతి చదివిన 105 మంది అప్పటి విద్యార్థులు సంక్రాంతికి సమావేశం కానున్నారు. దీనిపై చర్చించడానికి ఆదివారం బలభద్రపురంలోని ఆంధ్రాషిరిడి సాయి మందిరంలో దాదాపు 30 మంది సమావేశమయ్యారు. కార్యక్రమ నిర్వహణకు నిర్ణయాలు తీసుకున్నారు. వ్యవస్థాపక అధ్యక్షులు పురుషోత్తమరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

భాజపాలో పలువురి చేరిక

దేవీచౌక్: రాజానగరం మండలం పాలచర్ల, రఘునాథపురం గ్రామాలకు చెందిన 50 మంది ఆదివారం భాజపా జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు సమక్షంలో ఆ పార్టీలో చేరారు. రాజమహేంద్రవరంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ భాజపా సిద్ధాంతాలు నచ్చి ఇటీవల పలువురు పార్టీలో చేరుతున్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారు నిబద్ధత, క్రమశిక్షణతో నిస్వార్థంగా పనిచేయాలని సూచించారు. విశాఖ ఉక్కు పరిశ్రమ విషయంలో కేంద్ర పరిశ్రమల శాఖామంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడుతున్నట్లు చెప్పారని సోమువీర్రాజు ఒక ప్రశ్నకు సమాధానంగా స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, అడబాల రామకృష్ణారావు, నీరుకొండ వీరన్నచౌదరి తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారితో సోము వీర్రాజు

పలు కాలనీల్లో ఎమ్మెల్యే పర్యటన

ధవళేశ్వరం, న్యూస్‌టుడే: ధవళేశ్వరం పంచాయతీ కొత్తకాలనీ, రాజీవ్ కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొనేందుకు రాజమహేంద్రవరం గ్రామీణ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ఆదివారం ఆయా ప్రాంతాలలో పర్యటించారు. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఉన్నప్పటికీ ఈ ప్రాంతం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. మురుగుకాలువలు, రహదారులు, తాగునీరు సమస్యలను కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారానికి అంచనాలు సిద్ధం చేశామని త్వరలో పనులు మొదలవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. త్వరలో తాగునీటి ట్యాంకు నిర్మాణం పూర్తిచేసి ప్రతి ఇంటికీ మంచినీటి కుళాయి అందిస్తామన్నారు. తెదేపా నాయకులు మత్సేటి ప్రసాద్, పండూరి అప్పారావు, ఏకబాబు, మూర్తి, దశరథ్ పాల్గొన్నారు.


రాజీవ్ కాలనీలో సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గోరంట్ల

ఉచితంగా పరీక్షలు, మందుల పంపిణీ

టి.నగర్, న్యూస్‌టుడే: మెగావిన్ వాస్క్యులర్ కేర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత సిరల వాపు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. స్థానిక త్యాగరాజ్ నగర్‌లో హిందూ సమాజ్, న్యాపతి సుబ్బారావు పంతులు రోటరీ కళా వేదికలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని గ్రామీణం ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి ప్రారంభించారు. అనంతరం పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

చాగల్నాడు కాలువలకు మోక్షం

మెయిన్ కెనాల్‌లో పూడికతీత పనులు ప్రారంభం

వడిశలేరు(రంగంపేట), న్యూస్‌టుడే: చాగల్నాడు ఎత్తిపోతల పథకం ప్రధానకాలువలో పూడిక తీత పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ పనులకు జిల్లా తెదేపా ప్రధానకార్యదర్శి ఆళ్ళ గోవిందు శ్రీకారం చుట్టారు. రాజానగరం నుంచి రంగంపేట వరకు దాదాపు 10కిలోమీటర్ల వరకు ప్రధానకాలువలో పూడికను తొలగించనున్నట్టు అధికారులు తెలిపారు. ఏళ్ల తరబడి పూడిక పేరుకుపోయి నీరు ముందుకు సాగక ఆయకట్టులో నెలకొన్న నీటి కష్టాలను ఇటీవల నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి రైతులు వివరించగా ఆయన ఉన్నత స్థాయిలో చర్చించడంతో కాలువకు మోక్షం కలుగనుందని గోవిందు ఈ సందర్భంగా తెలిపారు. డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు పోతుల వెంకట్రాజు, నాయకులు మాచిన వెంకన్నదొర, ఉప్పలపాటి బుల్లిదొర, అడబాల వెంకట్రావు, అమ్మిరాజు పాల్గొన్నారు.

పొట్టదశలో ఉన్న వరిపై ఎండు తెగులు

సీతానగరం, న్యూస్‌టుడే: ఈ ఏడాది భారీ వర్షాల వల్ల తీవ్రంగా నష్టపోయిన వరి సాగులోని రైతులంతా.. ప్రస్తుతం పంటపై పెరుగుతున్న తెగుళ్ల బెడదతో తల్లడిల్లుతున్నారు. సీతానగరం మండలంలో సుమారుగా 14 వేల ఎకరాల్లో వరి వేశారు. మరో నెలరోజుల్లో పంట చేతికొచ్చే సమయంలో వరిమానులు ఎండిపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రామచంద్రపురం, పురుషోత్తపట్నం, చినకొండేపూడి, రాపాక తదితర ప్రాంతాల్లో వరిపై ఎండుతెగులు ఎక్కువగా ఉందంటున్నారు. ఎన్ని మందులు పిచికారీ చేసినా ప్రయోజనం ఉండటం లేదని దిగుబడులపై తీవ్ర ప్రభావం పడుతుందంటున్నారు. దిగుబడులు తగ్గి నష్టపోవాల్సి వస్తోందంటున్నారు. బీపీటీ సాంబ రకంపై ఈ ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. 3వేల ఎకరాలకు పైగా తెగులు సోకినట్లు గుర్తించామని సీతానగరం వ్యవసాయాధికారి కె. సూర్యరమేష్ తెలిపారు. నివారణకు ఎటువంటి మందులు లేవని. . యూరియా పూర్తిగా నిలిపివేసి, ప్రస్తుతం పొట్టదశలో ఉన్న వరికి ఎకరాకు 20 కేజీల చొప్పున పొటాష్ వేసుకోవాలన్నారు.


చినకొండేపూడిలో వరిపై ఎండు ఆకుతెగులు

లారీ ఢీకొని గాయాలు

రాజమహేంద్రవరం నేరవార్తలు: స్పినింగ్‌మిల్లు కాలనీకి చెందిన పి.ప్రతాప్ రెడ్డి ఆదివారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై లాలాచెరువు కూడలి దాటుతున్న తరుణంలో ఓ లారీ ఢీ కొంది. ఆ ప్రమాదంలో అతడి కాలుకు తీవ్ర గాయం కాగా.. నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆ మేరకు ఆసుపత్రి వర్గాలు బొమ్మూరు పోలీసులుకు సమాచారం ఇచ్చారు.

కొవ్వూరు

•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం



ప్రత్యేకాలంకరణలో గోలింగేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవారు

గోలింగేశ్వరస్వామికి లక్షపత్రి పూజ

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు పట్టణంలోని ప్రసిద్ధ గోలింగేశ్వరస్వామి ఆలయంలో 641వ లక్షపత్రిపూజను ఆదివారం ఘనంగా నిర్వహించారు. రాజరాజేశ్వరి అమ్మవారికి కుంకుమపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రుత్వికులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రేపు పశువైద్య శిబిరం

చాగల్లు, న్యూస్‌టుడే: చాగల్లు పశు వైద్యశాలలో ఈ నెల 8వ తేదీన పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మండల పశువైద్యాధికారి యు.ముఖేష్ తెలిపారు. అవసరమైన పశువులకు శస్త్ర చికిత్సలు, లేగ దూడలకు నట్టల నివారణ, గోమర్ల నివారణ తదితర వ్యాధి నిరోధక టీకాలు కూడా అందిస్తామన్నారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు చాగల్లు విద్యార్థి

చాగల్లు, న్యూస్‌టుడే: బాలుర అండర్-17 హ్యాండ్ బాల్ పోటీలకు చాగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు పి.వీర్రాజు ఆదివారం తెలిపారు. ఎంపికైన విద్యార్థి అభిరామ్‌ను, పీడీ విజయలక్ష్మిని పలువురు అభినందించారు.



విరాళ సొమ్మును ఎమ్మెల్యేకు అందిస్తున్న దొమ్మేరు నాయకులు

వరద బాధితుల సహాయార్థం విరాళం

చాగల్లు, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: వరద బాధితుల సహాయానికి పనిచేస్తున్న కూటమి నాయకుల కృషి అభినందనీయమని కొవ్వూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామానికి చెందిన తెదేపా నాయకులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో సేకరించిన రూ.లక్ష విరాళాన్ని కొవ్వూరు తెదేపా కార్యాలయంలో ఎమ్మెల్యే వెంకటేశ్వరరావుకు ఆదివారం అందచేశారు. కార్యక్రమంలో దొమ్మేరు తెదేపా సీనియర్ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే ప్రజా సమస్యలు పరిష్కారం



బాధితులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు

దేవరపల్లి, నల్లజర్ల న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ప్రజల సమస్యలు పరిష్కారం అవుతున్నాయని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అన్నారు. నల్లజర్ల మండలం తెలికచర్ల గ్రామానికి చెందిన కంచె సత్యనారాయణ అనారోగ్య సమస్యతో బాధపడుతున్నారు. ఇటీవల స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లగా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.32,500 నగదు చెక్కును బాధితుడి భార్యకు ఆదివారం క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సుంకర శివరామకృష్ణ, వాకాల అంజి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేకాలంకరణలో కోటసత్తెమ్మ, పూజల్లో పాల్గొన్న భక్తులు

కోటసత్తెమ్మకు సహస్రనామ కుంకుమపూజలు

నిడదవోలు, న్యూస్‌టుడే: తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో ఆదివారం సహస్రనామ కుంకుమపూజలు ఘనంగా నిర్వహించారు. 353 మంది దంపతులు సహస్రనామ కుంకుమపూజల్లో పాల్గొన్నారు. ఈ రోజు అమ్మవారికి వివిధ రూపాల్లో రూ.2,57,918ల ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.హరిసూర్యప్రకాష్, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త దేవులపల్లి రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

లోకజనని.. కరుణ రూపిణీ

న్యూస్‌టుడే బృందం: శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా దుర్గమ్మకు ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని పూలతో సుందరంగా అలంకరించారు. నాలుగో రోజు అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ● చాగల్లులోని పాటెమ్మ పేటలోని బాల కనకదుర్గమ్మ ఉత్సవ వేడుకల్లో భాగంగా కలశపూజోత్సవం నిర్వహించారు. 108మంది మహిళలు, యువతులు కలశాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ఒళ్లుగుంట ఆలయంలో హోమం నిర్వహించారు. ● నిడదవోలు మండలం వడ్డీలవీధి రావిచెట్టు, డి.ముప్పవరం గరువు ప్రాంతంలో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ విగ్రహాలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ● తాళ్లపూడిలోని నవదుర్గాదేవిని లలితా త్రిపుర సుందరిదేవిగా అలంకరించారు. వేగేశ్వరపురం, బల్లిపాడు, పెద్దేవం, మలకపల్లి, అన్నదేవరపేట, తాడిపూడి తదితర గ్రామాల్లోని పూజలు చేశారు. ● దేవరపల్లిలోని మూడు బొమ్మల సెంటర్, పల్లపు వీధి రామాలయం, శ్రీ బాలదుర్గమ్మ, నిమ్మలపాటి దిబ్బ, పల్లంట్లలో శ్రీశ్రీశ్రీ రాజరాజేశ్వరి సమేత దుర్గ మల్లేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవారు లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ బాలదుర్గమ్మ ఆలయంలో చండీ హోమం జరిపారు. ● ఉండ్రాజవరం బౌద్ధపీఠం ప్రాంతంలో కొలువైన దుర్గాదేవికి విశేష అలంకరణ, కుంకుమ పూజలు చేశారు. కె.సావరంలో ముత్యాలమ్మతల్లిని గజమాలలతో అలంకరించారు. ● కాకరపర్రు, ఖండవల్లి, ముక్కామల, అన్నవరప్పాడు, కానూరు, నడుపల్లి గ్రామాలలో ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్నారు.



చాగల్లులో ప్రత్యేకాలంకరణలో అమ్మవారు




పల్లంట్లలో రాజరాజేశ్వరి



ఉండ్రాజవరం బౌద్ధపీఠం వీధిలో..



ముక్కామల కేశవస్వామి ఆలయంలో..



డి.ముప్పవరం గరువు ప్రాంతంలో కనకదుర్గమ్మ..



తాళ్లపూడి: లలితాత్రిపురసుందరిదేవిగా..

రహదారులపై వ్యర్థాలు.. పట్టించుకోని అధికారులు..

పరిశీలన

దేవరపల్లి, న్యూస్‌టుడే: దేవరపల్లి మండలంలోని 15 పంచాయతీల పరిధిలో 21 సచివాలయాలు ఉన్నాయి. అయినా పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యర్థాలు గ్రామ శివారున రహదారుల పక్కన గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. అధికారులు పారిశుద్ధ్య సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. గుండుగొలను నుంచి కొవ్వూరు వెళ్లే పాత జాతీయ రహదారిని ఆనుకుని చెత్తచెదారాలు గుట్టలుగా పేరుకుపోయాయి. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ దారిలోనే రాకపోకలు సాగిస్తున్నా కన్నెత్తి చూడటం లేదు. సంపద తయారీ కేంద్రాలు ఉన్నా రహదారిపైనే పారిశుద్ధ్య కార్మికులు చెత్తను పడేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. శునకాలు, పందులు ఈ వ్యర్థాలను రహదారిపైకి లాగడంతో వాహనదారులు జారి రోడ్డు ప్రమాదానికి గురి అవుతున్నారు. కొబ్బరిబొండాలు, కోళ్ల వ్యర్థాలు, వేడుకల్లోని భోజనాల ప్లేట్లు తదితరాలు రహదారిపై వేస్తున్నా అధికారులు స్పందించడం లేదంటున్నారు. దీనిపై దేవరపల్లి ఎంపీడీవో ఎస్.వేణుగోపాల్‌ను వివరణ కోరగా.. అన్ని పంచాయతీల కార్యదర్శులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి పారిశుద్ధ్య నిర్మూలనపై సూచనలు ఇస్తామన్నారు.



మండలంలోని యర్నగూడెంలోని పాత జాతీయ రహదారిపై సుమారు కిలోమీటరు పొడవున వ్యర్థాలు పోగులుపడ్డాయి. ఏలూరు నుంచి రాజమహేంద్రవరం వెళ్లడానికి ప్రధాన మార్గం అవ్వడంతో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రి సమయాల్లో వ్యర్థాలు కనపడక ద్విచక్రవాహనదారులు ప్రమాదానికి గురవుతున్నారు.

మండల కేంద్రం నుంచి యాదవోలు వెళ్లడానికి ఇదే ప్రధానమార్గం. రెండు, మూడు గ్రామాల ప్రజలు ఇదే రహదారిలో ప్రభుత్వ కార్యాలయాలకు వస్తుంటారు. దేవరపల్లి గ్రామ శివారులో మంచినీటి ట్యాంక్ సమీపంలో చెత్తచెదారాలు దారి పొడవునా దర్శనమిస్తున్నాయి. నిత్యం రైతులు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. వీటిని తొలగించాలని కోరుతున్నారు.





యర్నగూడెం గ్రామ శివారులో గండి చెరువు వద్ద భారీ మలుపు ఉంది. ఈ మలుపులో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటాయి. ప్రమాదానికి గురై ఎంతో మంది మృతి చెందిన ఘటనలు ఉన్నాయి. ఇదే మలుపులో చెత్తచెదారాలు గుట్టలుగా పోగుపడి ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వ్యర్థాలను తొలగించాలి.

ధుమంతునిగూడెం పంచాయతీ పరిధిలోని సుబ్బరాయపురం వద్ద ప్రధాన రహదారిపై వ్యర్థాలు కుప్పలుగా ఉన్నాయి. సమీపంలో నివాసముంటున్న ప్రజలు నిత్యం చెత్తచెదారాలు ఇక్కడే వేస్తున్నారు. దీంతో వ్యర్థాలు కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది. దోమల వ్యాప్తి పెరుగుతోంది. పంచాయతీ అధికారులు పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలి.





నిర్మించారు.. వదిలేశారు

ఇది పశువులకు అవసరమైన సేవలు అందించడానికి నిర్మించిన గోపాలమిత్ర భవనం. సుమారు రూ.7.50 లక్షల వ్యయంతో గోపాలపురం మండల కోమటికుంట గ్రామంలో గత తెదేపా ప్రభుత్వంలో నిర్మించారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అది కాస్తా నిరుపయోగంగా మారింది. దాన్ని పట్టించుకున్న వారు లేక ప్రస్తుతం ఎందుకూ పనికి రాకుండా ఉంది. దీనిని వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై మండల పశువైద్యాధికారి ధరీన్‌బాబును వివరణ కోరగా సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. - న్యూస్‌టుడే, గోపాలపురం

ఇది రహదారేనా..?



ఉండ్రాజవరం మండలంలోని చివటం నుంచి తణుకు వెళ్లే రహదారిలో భారీ గుంతలు ఏర్పడి రాకపోకలకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి ఇలా ఛిద్రంగా ఉండటంతో ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులు అదుపుతప్పి బోల్తా కొట్టటంతో తరచు ప్రమాదాలు సంభవిస్తున్నాయని భయాందోళన చెందుతున్నారు. మరమ్మతు పనులు చేయించాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఆర్అండ్‌బీ ఏఈ శ్రీనివాసుని వివరణ కోరగా పరిశీలించి మరమ్మతు పనులు చేయిస్తామన్నారు. - న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

ప్రజా సేవలో మానవత



తెలికచర్లలో దివ్యాంగురాలికి రిక్షాను అందజేస్తున్న మానవత సభ్యులు

నల్లజర్ల, తాళ్లపూడి, న్యూస్‌టుడే: ప్రజా సేవలో తమ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఎప్పుడూ ముందుంటుందని ఆ శాఖ సభ్యులు అన్నారు. నల్లజర్ల మండలం చోడవరంలో అనారోగ్యంతో బాధపడుతున్న పెదముత్తి ఇస్మాయిల్‌కి పెండ్యాల చందు, ఆలపాటి శ్రీరామచంద్రమూర్తి రూ.5000 నగదును ఆదివారం అందజేశారు. తెలికచర్లలో పోలియోతో బాధపడుతున్న జానపోలు నాగలక్ష్మీకి రూ.15,300 విలువ గల మూడు చక్రాల రిక్షాను అందజేశారు. భోగవల్లి వెంకట సుబ్బారావు, పల్లి వెంకట అప్పారావు, గుళ్లపూడి వెంకటరత్నం, ఉన్నమట్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ● ఇటీవల రహదారి ప్రమాదంలో గాయపడిన తాళ్లపూడి మండలం రాగోపల్లికి చెందిన పి.రమేష్‌కు మానవత సంస్థ ఆదివారం రూ.6 వేలు ఆర్థికం సాయం చేసింది. ఆపదలో ఉన్నవారికి సంస్థ సాయం అందించేందుకు సంస్థ ఆధ్వర్యులు సురేష్ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా



అల్లుకున్న నిర్లక్ష్యం

సమస్య: సుబ్బరాయపురంలోని ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న విద్యుత్తు స్తంభాన్ని పాదులు అల్లుకుని ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. దీంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. అధికారులు స్పందించి తొలగించాలి. - స్థానికులు

సమాధానం: సమస్యను పరిశీలించి రెండు రోజుల్లో పాదులు తొలగించే విధంగా చర్యలు తీసుకుంటాం. - సీహెచ్ వెంకట్రావు, ఏఈ, దేవరపల్లి

– న్యూస్‌టుడే, దేవరపల్లి

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: కొవ్వూరు: 80085 74497
నిడదవోలు: 80085 74501, గోపాలపురం: 91212 29084

నిడదవోలు నియోజకవర్గంలో 19 మద్యం దుకాణాలు

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు నియోజకవర్గంలో 19 మద్యం దుకాణాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ లావణ్య తెలిపారు. దీనిలో భాగంగా పట్టణంలో నాలుగు, నిడదవోలు మండలంలో 5, ఉండ్రాజవరం మండలంలో 5, పెరవలి మండలంలో 5 చొప్పున దుకాణాలు ఏర్పాటు చేయనున్నారు. వీటికి సంబంధించి ఈ నెల 9వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా నియోజకవర్గంలో ఉన్న ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లలో స్వయంగా టెండర్ దాఖలు చేసుకోవచ్చునన్నారు. ఈ నెల 11న రాజమహేంద్రవరం ఆనంకళా కేంద్రంలో ఉదయం 8 గంటల నుంచి లాటరీ ద్వారా మద్యం దుకాణాల ఎంపిక జరుగుతుందన్నారు.

ఉచిత నేత్ర పరీక్షలు

నల్లజర్ల, న్యూస్‌టుడే: నల్లజర్ల మండలం దూబచర్లలో లయన్స్ క్లబ్, పార్ట్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర పరీక్షలు ఆదివారం నిర్వహించారు. శ్రీ సంఘమిత్ర విద్యాలయంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 100 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించగా 11 మందిని శస్త్రచికిత్సల నిమిత్తం వేమగిరి కంటి ఆసుపత్రికి పంపారు. కెల్లా వాసు, నెక్కంటి వెంకటేష్, కూచిపూడి ఉదయ్, భాస్కరరావు, సోమిశెట్టి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు డివిజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు



అధికారులకు సూచనలిస్తున్న జేసీ చిన్నరాముడు

చాగల్లు, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజన్‌లో వరి దిగుబడి గణనీయంగా వస్తుందని, అందుకు అనుబంధంగా జిల్లాలోని అన్ని మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు జేసీ చిన్నరాముడు తెలిపారు. కొవ్వూరు ఆర్డీవో కార్యాలయంలో రైతులతో, రైసు మిల్లర్లతో ధాన్యం కొనుగోలుపై నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొవ్వూరు డివిజన్ పరిధిలో 126 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. రైతులు, మిల్లర్లు, అధికారులు సమన్వయంతో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. జిల్లా వ్యవసాయశాఖాధికారి ఎస్.మాధవరావు మాట్లాడుతూ ఈ సీజన్‌లో రైతులు సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం పండిస్తున్నారన్నారు. సన్నబియ్యం ఎగుమతి చేయగా సుమారు 2.5 లక్షల మెట్రిక్ టన్నులు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇన్‌ఛార్జి జిల్లా పౌరసరఫరాలశాఖాధికారి ఎం.నాగాంజనేయులు, ఆర్డీవో రాణి సుస్మిత, ఏడీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి శిక్షణ తరగతులు

చాగల్లు, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: మండల స్థాయిలో ఈనెల 8వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ రాష్ట్రీయ గ్రామ స్వరాజ్య అభియాన్ (ఆర్‌జీఎస్ఎ) ప్రణాళికా కార్యాచరణలో భాగంగా రెండ్రోజుల శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.సుశీల ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ ఉపసర్పంచులు, ప్రతి గ్రామం నుంచి ఇద్దరు వార్డు మెంబర్లు, స్థానిక పంచాయతీ అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.

గుమ్మంపై పడి వ్యక్తి మృతి

నారాయణపురం (ఉంగుటూరు), న్యూస్‌టుడే: ఇంట్లో తల తిరిగి గుమ్మంపై పడి వ్యక్తి మృతి చెందిన ఘటన నారాయణపురంలో చోటు చేసుకుంది. చేబ్రోలు పోలీసుల కథనం మేరకు.. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం రావిమెట్లకు చెందిన కర్రి శ్రీనివాస రావు (52), కుమారి దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్దకుమార్తె దేవదుర్గకు నారాయణపురానికి చెందిన మణికంఠ వాసుతో వివాహమైంది. ఈ క్రమంలో ఈ నెల 5న శ్రీనివాసరావు, కుమారి దంపతులు రావిమెట్ల నుంచి నారాయణపురంలోని దేవదుర్గ ఇంటికి వచ్చారు. అదేరోజు రాత్రి శ్రీనివాసరావు మద్యం తాగారు. ఆదివారం ఉదయం టీ తాగిన తర్వాత తల తిరుగుతున్నట్లు అనిపించింది. ఇంట్లోకి వెళ్తుండగా ప్రమాదవశాత్తు గుమ్మంపై పడిపోయారు. రక్తపు గాయాలు కావడంతో భీమడోలులోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య కుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

'పోలీసు వ్యవస్థను తప్పు పట్టడం సరికాదు'

చాగల్లు, కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: కొవ్వూరు లిటరరీ క్లబ్‌లో ఇటీవల జరిగిన సంఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని మాల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బొంతా శ్యామ్ రవిప్రకాష్ ఓ ప్రకటనలో ఆదివారం డిమాండ్ చేశారు. రమ్మీ ఆడుకునేందుకు హైకోర్టు అనుమతి ఉందని చెబుతున్నా.. క్లబ్ నిర్వాహకులు ఆ అనుమతులు ఎప్పుడు తీసుకున్నారో బహిర్గతం చేయాలన్నారు. పట్టణంలో శాంతిభద్రతలను కాపాడేందుకు పనిచేస్తున్న పోలీసు వ్యవస్థను తప్పు పట్టడం సరికాదన్నారు.

అగ్నిమాపకశాఖ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఆనంద్‌రావు

నిడదవోలు, న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అగ్నిమాపక సేవల శాఖ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా నిడదవోలు అగ్నిమాపక కేంద్రంలో పనిచేస్తున్న తమ్మినేని ఆనందరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నిడదవోలు పట్టణంలోని తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా శ్రీను(నరసాపురం), కార్యదర్శిగా రమాకాంత్(పాలకొల్లు), సహాయ కార్యదర్శిగా నందగోపాల్(భీమవరం), కోశాధికారిగా రామాంజనేయులు(భీమడోలు), సలహాదారుగా శ్రీనివాస్(జంగారెడ్డిగూడెం), వెల్ఫేర్ అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు(నిడదవోలు), కార్యదర్శిగా రుద్ర నాగయ్య(తణుకు) ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా మస్తాన్, రాజేష్‌లు వ్యవహరించారు. అగ్నిమాపక ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా అధ్యక్షుడు ఆనందరావు తెలిపారు. సమావేశంలో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చంద్ర, రాష్ట్ర కోశాధికారి సత్యనారాయణ, రాష్ట్ర క్రీడా కార్యదర్శి సప్తగిరి గణేష్ తదితరులు పాల్గొన్నారు. ఎన్నికైన వారిని పలువురు అభినందించారు.



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు